# శీతారామయ్య పథకం

యాభైఅయిదు శీతువుల మంచుపేరుకున్నదాయెను, శీతారామయ్య తల పండిపోయింది. పక్కటెముకలు మేదరబుట్ట పేళ్లల్లే పొడుచుకొస్తున్నాయి. మొహమ్మీద ముడతలు నాగేటిచాళ్లల్లే లోతుగా స్ఫుటంగా అవుపిస్తున్నాయి. దవడలు నీళ్లింకిపోయిన దొరువులల్లే నొక్కుకుపోయినై. నెత్తిన చిక్కగావున్న జుత్తు మొదట తెల్లబడి, తరువాత పల్చనై, కొసకి బట్టతల పడిపోయి ఏవో నాలుగు పోచలు మిగిలినై.

శీతారామయ్య 'రిటైరు'కాగానే ఆఫీసులో ఒక చిన్న టీపార్టీ ఇచ్చారు లాంఛనప్రాయంగా. మంచివాడన్నారు. నిజాయితీ పరుడన్నారు. పెద్దమనిషన్నారు. ఆ పనికిరాని మూజువాణీ యోగ్యతా పత్రాలకి ఉబ్బితబ్బిబ్బయిపోక, గడిచిన ముప్ఫైమూడేళ్ల 'సర్వీసు'లోనూ తను తిన్నతిట్లూ, చివాట్లూ, నెత్తినపడ్డ అన్యాయాలూ, అభాండాలూ ఆ టీ నీళ్లల్లో ప్రక్షాళనచేసుకుని, నిర్లిప్తంగా ఇంటికి తిరిగివచ్చాడు. రోజూ భోంచేసి, ఒక పెద్దకునుకుతీసి, కాఫీసేవించి, నలభైనంబరు నేతపంచె కుచ్చిళ్లు ముడిచినవే ముడిచి, లంక పుగాకుచుట్ట తాపీగా చుట్టిందే చుట్టి, బట్టతలమీద రాలగా మిగిలిన నాలుగుఎకరాలూ దువ్వింDే దువ్వి, ఏమీతోచక, టైముగడవక, ఆంధ్రపత్రికలో వారఫలాలు చూస్తున్న రెండో అమ్మాయి వాణీని పిలిచి, "చదువు చదువు; ప్యాస్‌మార్కు లేమయినా వచ్చేనా ఈయేడు? అస్తమానూ పత్రికలూ నువ్వూనూ" అని వొక్కగదుము గదిమి, 'ఏమేవ్ బజార్లో ఏమయినా కావాల్నా?" అని ఒక్కసారి కేకపెట్టి, ఎంతకీ సమాధానం రాక, "ఈవిడ అంతపురంలోనించీ ఊడిపడదు" అని గట్టిగానసిగి, ఆకుచెప్పు లేసుకుని, ఏ శంకరమఠానికో, ఏ గీతాభవనానికో, ఒకహరికథనీ, ఒక ఉపన్యాసమనీ, ఒక పురాణశ్రవణమనీ ఏదో కాలక్షేపంచేసి చక్కా వస్తున్నాడు.

*　　　*　　　*

శీతారామయ్యకి ఇద్దరు కొడుకులూ ముగ్గురు కుమార్తెలూ. పెద్దవాడు నళినీమోహన్. నళినీ అని పిలుస్తారు వాడిని. రెండోవాడు రామచంద్రం. రామూ అని పిలుస్తారు. పెద్దమ్మాయి హైమావతి; హేమూ అని పిలుస్తారు ముద్దుగా. రెండో అమ్మాయికి అసలు పేరూ ముద్దుపేరూ

కలిశొచ్చేలా వాణీ అని పేరు పెట్టారు. మూడో అమ్మాయి రాధారాణి. రాధీ అని పిలుస్తారామెని ఇంటెల్లిపాదీ.

శీతారామయ్య తన వృద్ధాప్యంలో కృష్ణా రామా అనుకొంటో చీకూచింతలేకుండా కాలక్షేపం చెయ్యడానికి అనువైన ఏర్పాట్లన్నీ చేసుకొంటో వస్తోనే వున్నాడు. నళినికి బి.ఇ. పూర్తికావచ్చింది. పి.యు.సిలో 'క్లాస్' వస్తుందేమో బి.యి.లో సులభంగా 'సీటు' సంపాయించవచ్చునూ అనుకున్నాడు మొదట్లో. నళిని మాటదక్కించలేదు. తెలివితేటలైనవాడే కానీ, స్నేహితులెక్కువ. పుస్తకం ముందువేసుకోవడం తరవాయి, ఎవడో ఒక ప్రబుద్ధుడు, 'ఒరేయ్ మోహన్' అని గేటుదగ్గర, సైకిలు దిగకుండానే, ఒక కాలు 'పెడల్'మీదనించితీసి నేలమీద ఆన్చి, అతిజరుగురు పని ఏదో వున్నట్టు తయారయ్యేవాడు. దానితో, హడావుడిగా, ఏదో మునిగిపోయినట్టు, తెరిచిన పుస్తకం తెరిచినట్టే వుంచేసి, 'వొచ్చెవొచ్చె' అంటూ గబగబా 'బుష్‌షర్ట్' వేసుకుని, 'హవాయీ స్లిప్పర్లు' తొడుక్కుని, సైకిలెక్కి 'జై పరమేశ్వరా' అంటో అదేపోకగా పొయ్యేవాడు. ఆ పోక పోక ఎక్కడెక్కడ బలాదూరు తిరిగేవాడో మరి, రాత్రి పదింటికి ఇల్లు జ్ఞాపకంవచ్చేది. కళ్లు నలుపుకొంటో పెద్దచెల్లెలు హేమూ తలుపుతెరిచేది. 'ఒరేయ్ నాయనా, ఇంటి పట్టున ఉండరా, శ్రద్ధగా చదివి 'క్లాసు' తెచ్చుకోరా, 'బియి'లో 'సీటు' వస్తుందీ, అని చెవినిల్లుగట్టుకొని శతపోరేవాడు శీతారామయ్య. మొహానికి 'అయిటెక్స్' రాసుకొంటో, నెత్తికింత 'బ్రిల్ క్రీమ్' పులుముకొంటో, బీరువా అద్దాని కెదురుగుండా 'పాంట్ క్రీజులు' సరిచేసుకొంటో, 'ఆ తమ్ముడు తెగచదువుతున్నాడుగా!' అని ఎద్దేవాలకి దిగేవాడు నళిని.

రెండోవాడు రామం తెగచదివేమాట నిజమే. కానీ, చదువు తలకెక్కదు వాడికి. పుస్తకాలు మాత్రం ఎప్పుడూ ముందేవుండేవి. ఒక ఆటకనీ, ఒక సినిమాకనీ, ఒక మీటింగుకనీ ఎగబడేవాడుకాదు. ఇంతకీ, చదివితే నాలుగు మార్కులు తెచ్చుకోగల నళిని చదువడు; ఎంత చదివినా మార్కులు తెచ్చుకోలేని బుద్ధావతారం రామూ విరామంలేకుండా రుబ్బుతో కూచుంటాడు. ఏతావాతా, నళినికి 'పి.యు.సి'లో 'క్లాస్' రాలేదు. శీతారామయ్యకి పోణంగిరోడ్డు కెగువనీ పంటకాలువలపక్కని పెద్దలు సంపాయించిపెట్టిన కొంద్ర, సుక్షేత్రమైన మాగాణీ అయిదెకరాలుంది. రెండెకరాలు కరణం సుబ్బారాయుడికి తెగనమ్మి మూడువేలు 'డొనేష' నిచ్చి మణిపాల్‌లో 'బి.యి'లో 'సీటు' సంపాయించాడు నళినికి. తతిమ్మా మూడెకరాలూ సత్తిరెడ్డికి బేరం పెట్టాడు శీతారామయ్య. సత్తిరెడ్డిది కడుపునిండిన బేరం. శీతారామయ్యకి పైకం అత్యవసరమని ఎట్లా కనిపెట్టాడో కనిపెట్టాడు. పైకం నగదుగా గలవాళ్లు అమరలేదు. బేరం నాలుగురోజులు నలగనిస్తే నలుగురి మధ్యా ధర పలికేదే. కాని వ్యవధిలేదు. జాప్యంచేసేందుకా వీలులేదు. అయినకాడికి సత్తిరెడ్డికే అమ్మాల్సొచ్చింది. శీతారామయ్య తలవొగ్గాడు. ఆరువేలు 'డొనేష'నిచ్చి 'మెడికల్ కాలేజీ'లో చేర్పించాడు రామచంద్రాన్ని. భూమి పుట్రా కొంపా గోడీలేదని ఫారాలునింపి దరకాస్తు దాఖలు చేస్తే గవర్నమెంటు 'లో'నిచ్చింది రామం 'యం.బీ' చదువుకుని ఉద్యోగం వచ్చింతరవాత నెలజీతంలోనించీ దఫాలవారీగా ఆలోను తీర్చుకుందుకు సదుపాయమొకటి అమరివచ్చింది. శీతారామయ్య అదృష్టవంతుడు. నెలనెలా రామూకి పంపవలసిన డబ్బులో కొంత కలిశొచ్చింది. అదే మహద్భాగ్యమనుకుని తలతడిమి చూచుకున్నాడు శీతారామయ్య.

ఒక కొడుకు ఇంజనీరూ, ఒక కొడుకు డాక్టరూ కావాలని శీతారామయ్య ఆశయం. ఆ కోరిక నెరవేరింది.

* * *

శీతారామయ్య ముప్ఫయిమూడేళ్ల క్రితం స్కూల్‌ఫైనల్ ప్యాసయి డి.యి.వో. ఆఫీసులో నెల 1 కి 30 రూపాయల జీతమ్మీద 'లోయర్ డివిజన్' గుమస్తాగాజేరి, అప్పట్లో అర్ధరూపాయీ, రూపాయీ లెఖ్ఖనా, దరిమిలా పెరిగి మూడూ అయిదూ రూపాయల లెఖ్ఖన, సాలుసరి 'ఇంక్రిమెంట్ల' తోసహా, దఫాలవారీగా తాబేటినడకమీద సాగిన జీతాల 'స్కేళ్ల' మీద, కరువు బరువుతో పొంతనలేని కరువుభత్యం కలుపుకోగా, ముప్ఫయి మూడేళ్ల సర్వీసయింతరువాత రెండువందలపై చిల్లర అంకె అందుకున్నాడు. ఇక యాభై అయిదేళ్లు నిండినై. తప్పుకోమన్నారు. 'పెన్షన్' దెబ్బయి మూడు వస్తోంది.

పొలం క్రియదస్తావేజు వ్రాసి తలవంచుకుని మౌనంగా ఇంటికి తిరిగివస్తుంటే సాక్షి సంతకాలకని కూడా వచ్చిన రైతు సుబ్బయ్య, 'ఏందట్టా దిగులుగా ఉండావు పంతులూ? ఈ గుప్పెడు నేలా ఆర్చేనా తీర్చేనా, జగజ్జెట్టీల్లాంటి కొడుకులిద్దరు అటూ యిటూ ఉండగా నీకొచ్చిన లోటేందయ్యా?' అని భరోసా ఇచ్చాడు. ఇంటికొచ్చి హాలులో బెంచీమీద కూలబడి కండువాతో కళ్లొత్తుకుంటుంటే భార్య పార్వతమ్మ తలుపుదగ్గర ఓరగానిల్చుని, 'రిజిస్టరయిందా?' అని పరామర్శించింది. తలవూపాడు శీతారామయ్య పార్వతమ్మ కళ్ళు తుడుచుకుంటూ, 'ఏమిచేస్తాం. మనేదపెట్టుకోకండి. ఇన్నాళ్లూ ఆ గడ్డమీదనే బ్రతికామా గంపెడు కామాటంతో? ఏదో వేన్నీళ్లకి చన్నీళ్లుగా ఇన్నిగింజలు తెచ్చుకున్నాం ఏటేటా. ఈనాటితో ఆ భూదేవికీ, మనకీ రుణం తీరిపోయింది. పిల్లలు చేతికంది వస్తే మన కష్టాలు గట్టెక్కకపోతయ్యా?' అని వోదార్చింది.

హేమూ, వాణీ, రాణీ అప్పుడే బడినించీ వస్తో పుస్తకాలు అరమరలో సర్దేసుకుని, దిగులుపడి పోయివున్న ఇద్దరివంకా బితుకూబితుకూ చూస్తో నిలబడిపోయారు.

శీతారామయ్య తేరుకున్నాడు.

వేసుకున్న అంచనాలకి అనుగుణంగానే, శీతారామయ్యకి యాభయ్యయిదేళ్లూ నిండి రిటైరయ్యేటప్పటికి ఇద్దరు కొడుకులూ 'కోర్సులు' పూర్తిచేసుకుని ఒకడు భిలాయ్‌లో 'అసిస్టెంట్ ఇంజనీరు' గానూ, ఒకడు హైదరాబాదులో ఉస్మానియా మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో 'అసిస్టెంట్ సర్జన్ గానూ' ఉద్యోగాలు సంపాదించుకున్నారు. ఎవరెవరిని ఎట్లా పట్టాలో అట్లా పట్టాడు శీతారామయ్య. ఉద్యోగానంతరం మూడువేలు 'గ్రాట్యుయిటీ' వస్తే దానితో హేమూపెళ్లి చేసాడు. బెజవాడలో రాచర్లవారి సంబంధం. సారసంప్రదాయాలుగల కుటుంబం. కుర్రవాడు గుంటూరు కాలేజీలో 'ఇంగ్లీష్ లెక్చరర్.' పెళ్లి చూపులయిం తరవాత, ఈ పిల్లని తప్ప ఇంకెవత్తినీ ససేమీ చేసుకోనని భీష్మించుకుని కూచున్నాడు వరుడు. ఆ రహస్యం తల్లిదండ్రులతో గుంభనంగా అని చక్కా ఊరుకోక అలవుకికంగా బైటపెట్టినందువల్ల పిల్లిమీదబెట్టీ పీటమీదబెట్టీ కట్నం అంతకు కొంత గుంజే అవకాశం బొత్తిగా సన్నగిల్లిపోయింది వియ్యాలవారికి. అంచాత కట్నాల ప్రసక్తి

లేకుండానే సమంధం అమిరినా, ఆనవాయితీ ఉన్నవీ లేనివీ, జ్ఞాపకంలేనివాటిని అడిగి తెలుసుకొనీ, కాలదోషం పట్టినవాటిని తిరగదోడి, ఆ ప్రాంతంలో ఉన్న రివాజులూ, ఇతర ప్రాంతాలలోఉన్న ఆచారాలూ అన్నీ కలగలిపి, పురోహితుణ్ణీ బంధువర్గాన్నీ గుచ్చి గుచ్చి ఆరాలడిగి, సూచనలందుకుని, అడుగడుక్కీ లాంఛనాలు కొన్ని రుద్ది, కొన్ని గుంజి, కొన్ని దౌర్జన్యంగా రాబట్టుకుని, వియ్యాలవారు చేసిన దాష్టి కానికిలోబడి పెళ్లి అయిందనిపించేసరికి తలప్రాణం తోకకివచ్చింది శీతారామయ్యకి. చేతిలోవున్న మూడువేల కరుకులూ ఖాళీఅయి బట్టల కొట్టులోనూ, పచారీకొట్టులోనూ, పుల్లల అడితీలోనూ, అక్కడక్కడ కొన్ని చిల్లర అప్పులు మిగిలినై. 'హేమూ మెరుపుతీగలాంటిపిల్ల చిదిపి దీపంపెట్ట వచ్చును. ఇంటికే ఒక వెలుగు... అని పెళ్లివారయితే మురిశారు కాని, అత్తా ఆడబడుచులుమాత్రం, కట్నాలు లేకుండా, కానుకలతో మాత్రం కారుచవకగా టింగురంగా అంటూ ఇంట్లో అడుగపెట్టిన కోడలిని మాత్రం ఓపట్టాన క్షమించలేదు. మూతి విరుపులతో, ముక్కు విరుపులతో, నిష్ఠూశాలతో శాపనార్థాలతో, ఎద్దేవాలతో హేళనలతో ఎట్లాగో ఆ మూడుముళ్లూ పడినయ్యనిపించి హేమూని కాపరానికి పంపించేశాడు శీతారామయ్య. కార్యంపట్ల తలవంచుకుంటే కలకాలమూ తల ఎత్తుకుని తిరగవచ్చు ననిపించాడు మొత్తంమ్మీద.

ఆ పెళ్లి హడావుడిలో అద్దెకున్నభాగం చాలక నెలకి యాభై ఇచ్చి, ఒక చిన్న దాబాయిల్లు అశోక నగరంలో ప్రత్యేకంగా తీసుకోవాలిశొచ్చింది. అక్కడక్కడ పేరుకుపోయిన అప్పులు దఫాలవారీగా తీర్చేశాడు. ఆయన పెన్షన్ సరేసరి ముష్టి దెబ్బయి మూడు రూపాయలు. అంచాత కొడుకులు పంపుతున్న పైకంలో కొంతకు కొంత కుటుంబపోషణ క్రిందనే సరిపెట్టవలసి వచ్చింది.

వాణి 'యస్.యస్.యల్.సి' ప్యాసయి 'పి.యు.సి'లోకొచ్చింది. రాధారాణి 'యస్.యస్.యల్.సి'లోకి వచ్చింది. వాణి చామనఛాయయినా ఒక 'డిగ్రీ' హెచ్చించి కొంచెం ఎరువు అని చెబుతోవుంటాడు శీతారామయ్య. కోటేరేసినట్టు ముక్కూ, 'టేబిల్‌టెన్నిస్' బంతిలాంటి గుండ్రని చిన్ని గడ్డమూ, ఎంచక్కా వుంటుంది – అని తల్లిదండ్రులయితే మురిశారుగాని, పెళ్లిళ్లమార్కెట్టులో విడుదలకి సిద్ధంగావున్న, వరుళ్ల తల్లిదండ్రులుమాత్రం, ఆకర్షించవలసిన కట్నాలస్థాయి ఎక్కడ దిగజారుతుందోనని ఆ కన్య అందచందాలు అంతంతగానే వొప్పుకుని చక్కా వూరుకుంటున్నారు. రాధారాణి విచ్చిన ముద్దబంతి పువ్వులా వుంటుంది. 'క్లాసు'లో మణిపూస అనిపించుకుంటున్నది. రవ్వంత పెంకెఘటం మాంచి జబరైన వొళ్లు. గెడ్డానికి మధ్య చిన్న నొక్కు. నవ్వితే బుగ్గలమీద సొట్టలుపడతాయి. అప్పుడు ఆమె లావణ్యమంతా ఆ చిన్న సుడిగుండాలలో కుదించుకుపోయిందా అనిపిస్తుంది. రెండు జడలు వేస్తుంది. అలవోకగా ఒక జడ ముందుకీ ఒక జడ వెనక్కీ కేటా యిస్తుంది. పెద్దదానవయ్యావు ఇక రెండుజడలు మానవే మా తల్లీ' అని నసిగింది పార్వతమ్మ. 'ఊ చెప్పొచ్చావులే,' అని ఒక్క ఉరుమురిమి, ముందున్న జడ కూడా వెనక్కిపడేలా విదిల్చికొట్టి తల ఎగరేసి, 'హైహీలు బూట్లు' గచ్చునేలమీద టకటకలాడించుకుంటూ వెళ్లిపోయింది రాధ.

*     *     *

దీనికితోడు కొత్త యిబ్బంది ఒకటి వచ్చి పడింది శీతారామయ్యకి. కొడుకులిద్దరూ పెద్ద చదువులు చదివి హుందాగల ఉద్యోగాలలో ఉన్నారూ అనగానే, మా పిల్లనిస్తామంటే

మాపిల్లనిస్తామని మోతుబరి సమంధాలే కోకొల్లలుగా వస్తున్నాయి. సెలవలలో నళిని రామూ ఇంటికివచ్చినప్పుడు కొందరూ, అంతవరకూ ఆగలేక అటు భిలాయ్‌కీ, ఇటు హైదరాబాదుకీ, హుటాహుటిని పయనమై కొందరూ, కుర్రవాళ్లని చూచుకుని వచ్చి పిల్ల కాయల్ని చూచుకోమని మరీమరీ చెప్పి చక్కాబోతున్నారు. వాళ్లకి కాఫీలూ, టిఫిన్లూ అందించా, హుందాగిరీగా గౌరవ మర్యాదలూ జరపా శీతారామయ్య పాలబడినై. దానాదీనా ఊపిరాడడంలేదు. ఇంట్లో చూడబోతే ఒక కుర్చీలేదు. ఒక టేబిల్ లేదు. నాజూకయిన సామానేలేదు. ఇన్నాళ్లూ ఏదో సంసారపక్షంగా చక్రం దొర్లించేస్తూ వచ్చాడు. ఇహ నామర్దా అనిపించింది. స్టెయిన్‌లెస్‌స్టీలు సెట్లు కొన్నాడు. 'సోఫా కం బెడ్డొ'కటి తీసుకున్నాడు. రెండు 'ప్లాస్టిక్ కేన్ గార్డెన్ ఛెయిర్లూ,' మంచాలకి దోమతెరలూ, ఒక 'ట్రిపాడ్,' ఒక అందమైన 'టీసెట్టు' నాగరికమైన కొత్త వాతావరణం కలిపించాడు. హాలులో 'ఉషా సీలింగ్‌ఫాన్' వేయించాడు. వీటన్నింటికీ డబ్బయింది.

కుర్రవాళ్లేమో అక్కడా అక్కడా ఉద్యోగాలు చెలాయిస్తున్నారు. వాళ్లూ వీళ్లూ శీతారామయ్య మీద వచ్చి పడుతున్నారు. 'దాహమే మాత్రం?' అని ఆరా తీస్తున్నారు. శాశ్వతమటయ్యా, కుటుంబ సాంప్రదాయమూ మంచీ చెబ్బరా చూసుకోవాలి గాని అని ధర్మపన్నాలు ఏకరువు పెడుతున్నారు. హేమూ పెళ్లి 'సెటిల'య్యే ముందు ఇట్లాంటి చవక వేదాంతాలే వల్లించాడు తనూ. ఇక వాణీకి సంబంధాలు వెతుక్కునే సందర్భంలో ఎట్లాగూ అక్కర కొస్తాయి గదా అని ఆ శ్రీరంగనీతులు మళ్లీ ఒకసారి నెమరుకి తెచ్చుకుని మననం చేసుకున్నాడు శీతారామయ్య. అప్పుడు తన ఆర్థికస్తోమతూ గట్రా ఏదో గుంభనగా బైటపెట్టి నీళ్లు నములుతుంటే, 'చాల్ చాల్లేవయ్యా ఇద్దరు కొడుకులు 'గెజెటెడ్ ఆఫీసర్ల'యి బరాబరులిస్తుంటే పేదరుపులూ నువ్వూనూ అని గదమాయించి తన నోరు మూయించారు. ఇకపోతే, వచ్చినవాళ్లు ఇంకో ఎత్తు ఎత్తారు. 'హేమూకి ఏమాత్రం కట్నమిచ్చావేమిటి?' అని నిగ్గదీస్తున్నారు మధ్యవర్తుల ద్వారా. హేమూ పెళ్లి కిచ్చిన కట్నం పూర్ణానుస్వారం కాబట్టి, ఆ సున్నాకి పైనే ఏదో ఒకటి ముట్టజెప్పి, లఘువుగా పైసలు చేసుకుందామనీ కొందరు ముగ్గులోకిదింపాలనీ చూశారు శీతారామయ్యని. ఈ యుక్తులన్నీ గ్రాహ్యమవుతోనే వున్నాయి. ఎవరెన్నివిధాల తొందరపెట్టినా, 'కుర్రవాళ్లు సంక్రాంతి శలవలకి వస్తారు. అప్పుడు పిల్లకాయిలని చూచుకుని, వాళ్లు అవునంటే తతిమ్మా వ్యవహారకాండ చూచుకో వచ్చును,' అని నచ్చజెప్పి పంపేస్తున్నాడు. అయితే, వచ్చినవాళ్లు ఇంట్లో పరిచిన తివాచీలూ, తివాచీలమీద 'పాలిష్' చేసిన 'ట్రిపాడ్,' 'ట్రిపాడ్'మీద 'టీ సెట్టూ,' టీ నీడలలో మెరుగులుచిమ్మే 'సీలింగ్ ఫానూ,' మొదట్లో కళ్లు జిగేల్మనిపించినా, అది అద్దె కొంపనీ, వెనకాల ఉందుకున్న స్థిర చరాస్తులు పూజ్యమనీ, వాకబుమీద తేలిపోవడంలో, కొంత చప్పరించేసినా, కుర్రవాళ్ల స్ఫుర ద్రూపమూ, చదివిన గొప్ప చదువులూ, చేస్తున్న పెద్ద ఉద్యోగాలూ, కేవలం ఆస్తులు కాకపోయినా చెప్పుకోతగ్గ తత్తుల్యమైన ఐశ్వర్యాలుగానే లెఖ్ఖ వేసుకుని చక్కాబోతున్నారు.

అనుకున్నట్టుగానే కొడుకులిద్దరూ సంక్రాంతి శలవలకి రానే వచ్చారు. రామచంద్రానికి విజయరాఘవంగారి అమ్మాయి సెటిలయ్యింది. ఆయనకి విశాఖపట్టణంలో ఒక 'ఆయిల్ మిల్లూ' ఒక 'రైస్‌మిల్లూ' ఉన్నాయి. అమ్మాయి 'బి.యె' పాసయింది. చక్కని చుక్క. నళినీ మోహన్‌కి చక్రధరంగారి అమ్మాయిని ఫైసల్ చేసుకున్నారు. ఆయన హైదరాబాదులో 'సెక్రటేరియట్'లో

సీనియర్ సూపరింటెండెంటుగా ఉంటున్నారు. విజయ రాఘవంగారూ, చక్రధరంగారూ షడ్డకులు. ఇద్దరూ కూడబలుక్కుని చెరో పదిహేనువేలూ ముట్టజెప్పడానికి సిద్ధంగానే వున్నారు. కాని చట్టరీత్యా కట్నాలు నిషేధం కాబట్టి 'రూల్సు'కి వ్యతిరేకంగా నడవడం ఇద్దరికీ సుతరామూ ఇష్టంలేకా, పైకం యావత్తూ విజయరాఘవంగారి రైస్‌మిల్లులో రూపాయివడ్డీమీద జమకట్టి ఖాతా పుస్తకంమీద పద్దులు యధాలాపంగా చూపించారు శీతారామయ్యకి. పదిహేనువేలు కట్నం, పదిహేనువేలని ఊరూవాడా మోగిపోయింది.

శీతారామయ్య తల గోక్కున్నాడు. అసలు ఆయన అనుకున్నదొకటీ, జరుగుతున్న తంతు వేరూను. కట్నాల సొమ్ము కొంతయినా చేతిలో పడితే పెళ్లి ఖర్చులెత్తిపోతయ్యని ఊహించాడు. కాని పడనియ్యలేదు వాళ్లు. తను కూడబెట్టుకున్న 'జి.పి. ఫండు' తాలూకు పధ్నాలుగు వందలూ, కుర్రవాళ్లు పంపిన మనియార్డర్లలోనూ, దేవుడు మేలుచేస్తే పొలం అమ్మగానూ మిగిలిన మూడు వేలూ వెరశి నాలుగువేల పైచిలుకు అట్టే పెట్టివుంచాడు, వాణి పెళ్లికి అవసరం కావచ్చని. అక్కడికి ఆ పెళ్లి వెళ్లమారిస్తే, ఇహను రాధమ్మకి సమంధాలు విచారించుకోవచ్చును; అని అంచనాలు వేసుకుని కూచున్నాడు. ఆ నాలుగురాళ్లూ చేజారిపోయేలా వున్నాయి కుర్రవాళ్ల పెళ్లిఖర్చుల క్రింద.

పార్వతమ్మ పూర్వోత్తరపు మనిషి. చదవనూ, వ్రాయనూ రాని ముత్తయిదువు. ఏదో లంకాయాగమూ, గోవిందనామాలూ పాడుకొంటూవుంటుంది. ఏ వ్రతాని కెంతమంది బ్రాహ్మల్ని పెట్టుకోవాల్నో, ఏ నోములు కెన్ని వాయనా లివ్వాల్నో, పురుళ్లకీ పుణ్యాలకీ జరగాలిసినతంతేమిటో క్షుణ్ణంగా తెలుసును. తరతరాలుగా వస్తున్న సంప్రదాయ విజ్ఞానం ఆమెసొత్తు. తిధి వార నక్షత్రాలకని ఇరుగూపొరుగూ వస్తుంటారు. కాలునొచ్చినా, కడుపునొచ్చినా ఇంత విభూది పెడుతుంది. ఆచారమూ మడీ పూజా పునస్కారమూ ఇదీ ఆమె లోకం. పాతకాలపు మంగళ హారతులూ, వరసపాటలూ నేర్పబోయింది ఆడపిల్లలకి. వాళ్లు వెక్కిరించారు.

ఇంటి వ్యవహారాలలో ఎన్నడోకాని జోక్యం కలగజేసుకోదు పార్వతమ్మ. ఈ హంగామా ఆమెకి నచ్చలేదు. 'పెళ్లికెదిగొచ్చిన ఆడపిల్లలు ఇంట్లో మసులుతుండగా మొగపిల్లల పెళ్లిళ్ళ కేమి తొందరొచ్చింది?' అని దీర్ఘంతీసిందొకనాడు, చాటలో బియ్యం పోసుకుని గద్దలేరుతూ. శీతారామయ్య చెప్పులేసుకుని ఎక్కడికో బయలుదేరుతున్నవాడల్లా, 'ఊరుకోవోయ్ అన్నిపాములూ పడగలెత్తినయ్యని బురదపామూ తలెత్తిందట!' అని ఒక్క విదుపు విదిపి చక్కాబోయాడు. దానితో పార్వతమ్మ నోరుమూసుకుంది. సన్నాయి నొక్కులు నొక్కనూ, మాటకి మాట రెట్టించనూ ఆమె ఇంటావంటాలేదు.

దానికితోడు నళిని ఆ పిల్లే కావాలని ఒకటే పట్టు. ఆ సంబంధంగాని పరిష్కారం కాక పోతే నాకసలు పెళ్లే అఖ్ఖర్లేదు అనేదాకా వచ్చింది అతగాడి ధోరణి; ఆ మాట కాస్తా 'పబ్లిగ్గా' అనకురా వాళ్లు ముట్టజెప్పదలుచుకున్నది కాస్తా మురిగిపోగలదు, అని వాణ్ణి వప్పించేసరికి బ్రహ్మ ప్రళయమయింది. దానితో శీతారామయ్య కాళ్లూ చేతులూ కట్టేసినట్టయిపోయింది. ఇంతకీ కళ్యాణాలు తోసుకొచ్చేస్తున్నాయి అన్నారు పెద్దలు.

తాంబూలాలు పుచ్చుకున్నారు. ప్రధానమయింది. రెండు పెళ్లిళ్లూ హైదరాబాదులోనే జరిగినై.

ఇక విజృంభించారు ఆడపెళ్లివారు. అంతంత డబ్బు వళ్లోపోసుకున్నావు పెట్టవయ్యాపెట్టు అని నౌబత్ఖానా, నాదముని బ్యాండు, పిచ్‌హరి సన్నాయి, భరతనాట్యం అన్నీ పెట్టించారు. బాణాసంచా తగలేయించారు. ఊరేగింపు దర్జాగా ఉండాలన్నారు. బంధువర్గంకన్న, 'ఆఫీసర్లే'నా, స్నేహితబృందమేనా ఒక్కపెట్టున ముట్టడించేసారు పెళ్లిపందిరి. వాళ్ల దర్జాలకి హొదాలకీ దద్దరిల్లి పోయాడు శీతారామయ్య. పెళ్లివారు పెద్దఎత్తున నడిచారు. శీతారామయ్య ఆ ఫాయాకు తగ్గట్టు నడవాలిశొచ్చింది. వాళ్లు రెండు వందలు పెట్టి 'గ్వాలియర్ ట్వీడ్ సూటు' తెస్తే, తను మూడువందలు విరజిమ్మి ఆగ్రాచీర తియ్యాల్సొచ్చె. అప్పట్లో కొంత వొళ్లూపై తెలీలేదు కూడా. పెళ్లిళ్లలో అంతే. అవతల జుట్టు విరబోసుకుంటుంటే, ఇవతల గంగవెర్రులెత్తుతాయి.

పెళ్లికొడుకులు మనుగుడిచారు! వియ్యాలవారు పెట్టిన ఘనమైనసారెతో కోడళ్లని కొడుకులతో సాగనంపేసరికి ప్రాణం చాలొచ్చింది శీతారామయ్యకి. తృప్తిగా నిట్టూర్చాడు.

రెండురోజులు విశ్రాంతి తీసుకుని సావకాశంగా పెట్టెలోంచి పర్సుతీసి లెఖ్ఖపెట్టుకుంటే రూ. 260/- ఉన్నాయి. కొన్నాళ్ల దాకా మామూలుగా చెరోవందా పంపారు కుమాళ్లిద్దరూ.

వాణీకి సమంధాలు చూస్తున్నాడు శీతారామయ్య. ప్రయాణపు ఖర్చులే బోలెడయి పోతున్నాయి. దానా దీనా పైకం వెసులుబాటు కాలేదు. ఇప్పుడే కొంత వెనక వెయ్యాలికూడాను. అట్లాగే నెట్టేస్తున్నాడు.

ఆ తరవాత అదేమిటో కూడబలుక్కున్నట్టు, చెరోయాభై పంపించడం ప్రారంభించారు కొమాళ్లిద్దరూ, కోడళ్లూ అయినింటి బిడ్డలాయెను కొత్త కాపరాలు పదుచులకాపరం చితుకులమంట ఇళ్ల అద్దెలే బోలెడు పొయ్యాలిగావును ఆ మహానగరాలలో ఎవడికెవడు? ఎట్లా కాలక్షేపం చేస్తున్నారో ఏమిటో చిన్న సన్నాహాలు, అని ఏక ఇదయిపోయారు, శీతారామయ్యాను, పార్వతమ్మాను.

కొన్ని నెలలయిం తరువాత ఆ యాభై పాతికకి దిగింది.

శీతారామయ్య గుండె ఆగింది.

ఉత్తరాలు అటూ యిటూ నడుస్తోనేవున్నాయి. డబ్బు ప్రస్తావనమటుకు ఎవరూ తేవడం లేదు. ఎబ్బెట్టుగా వుంది.

ఆ తరవాత నళిని వక్కడే ఒక పాతిక పంపించడం సాగించాడు. తనకి తప్పుతుంది గనకనా. శీతారామయ్య రాశాడు కుటుంబ ఖర్చులికే కిచాటుగా వున్నదని ముక్తసరిగా, రామచంద్రం దగ్గరనించీ సమాధానం వచ్చింది. తన 'యం.బి' చదువుకని తెచ్చిన'లోను' నెలవారీగా తీరుస్తున్నాడట. అంచేతనేమీ పంపలేకపోతున్నాడట. ఆ మాత్రం వంక దొరకలేదు పాపం నళినికి. అంచేత గప్‌చిప్పుగా మాట్లాడకూరుకున్నాడు.

అసలు వీళ్ల జీతాలెంత? ఎంత ఖర్చవుతోంది? ఎంత మిగల్చడానికి సాధ్యమవుతుంది?

అని తవిశీలుగా ముఖాముఖీగాని, ఉత్తరాలమీదగాని ఆరాలడిగే సాహసం ఏనాడో చచ్చిపోయింది శీతారామయ్యలో. పెళ్లిళ్లకి ముందు రెండురోజులు కద్దనంగానే వాళ్లిద్దరూ ఇంటికొచ్చినా 'బనియన్ల'తో చారల 'పైజామాలతో' నిక్కి నీలిగి తొమ్మిదింటికి లేచేవాళ్లు. లేచి కాలకృత్యాలు తీర్చుకోగానే రివ్వున ఎక్కడికో ఎగిరి చక్కాబోయేవాళ్లు. పెద్ద పెద్ద ఆఫీసర్లు స్నేహితులాయెను! ఇంటికివస్తూనే 'ట్వీడ్‌సూట్లూ' 'గోల్డ్ రిమ్డ్ గాగులూ' వేసుకున్న పదిమంది ఆఫీసర్ల సజ్జు అమాంతం బిళ్ల పెట్టుగావచ్చి పడేవాళ్లు కాస్త వివరాలడుగుదామంటే వీలుచిక్కకనేపాయె. వేశే ప్రశ్నలకి ఒకటీ అరా సమాధానం రాబట్టడం గగనమయిపోయింది. తను కొంచెం లోతుగా గుచ్చి గుచ్చి అడిగేందుకు సంకోచమయ్యేది. వాళ్లేదో కొండశిఖరం మీద వున్నట్టూ, తను నేలబారుగా పోతున్నట్టూ 'ఫీ'లవుతున్నాడప్పుడే.

తరవాత తరవాత ఉత్తరాలకి ఆలస్యంగా జవాబులు రావడమూ, వొచ్చినా, అందులో తనక్కావాలిసిన ముఖ్యాంశంమాత్రం లోపించడమూ జరుగుతోంది. అసలు తన వుత్తరాలు అందుతున్నయ్యో లేదో నన్న మీమాంస అంకురించేలా, ఆకుకి అందకుండా, పోకకి పొందకుండా ఉంటున్నాయి జవాబులు.

వాణికి సమంధంకోసమని గోపాలపురం వెళ్లిరావాలి. అక్కడ 'రివిన్యూ ఇన్‌స్పెక్టర్' గారి అబ్బాయి ఎవరో ఉన్నారని 'హెడ్మాస్టరు' గారి తమ్ముడు వర్తమానం తీసుకొచ్చాడు మొన్న. అదుగో ఇదుగో అని వాయిదాలు వేసుకుంటూ కూచున్నాడు తను.

'ఒక పది రూపాయిలిట్లా ఇవ్వవే' అని అరిచాడు శీతారామయ్య. కండువా భుజమ్మీద వేసుకుని చాకింటిమడత విప్పడంలో రాలిన ఇసక దులుపుకున్నాడు. లోపలనించి సమాధానం రాలేదు. 'ఎవ్వరూ ఫికరులేరేమే? బండి దాటిపోతుంది మళ్లీ' అని కసురుకున్నాడు ఆకుచెప్పు లేసుకొంటూ. 'కర్టెన్' సన్నగా తొలిగించి, 'డబ్బులేదుట నాన్నా...' అన్నది రాధారాణి బిక్కు బిక్కుమంటో అని 'కర్టెన్' వేసేసింది. నిర్ఘాంతపోయి ఆ పాటన నిల్చుండిపోయాడు శీతారామయ్య. ఆ క్షణం గుండెలో పోటొచ్చినట్టు చురుక్కుమంది లోపల. తన 'పెన్షన్' డెబ్బయ్ మూడు రూపాయలనీ, అటు భిలాయ్‌లోనూ ఇటు హైదరాబాదులోనూ ఉద్యోగాలు వెలిగిస్తున్న ఇద్దరు ఆసాముల తాలూకూ దయారసం తనమీదికి అంతో ఇంతో ప్రసరిస్తే సరేసరి, లేకపోతే, తన జీతపు పరిధి ఆ డెబ్బయిమూడు రాళ్లూ దాటిపోరాదనీ అందాకా తెలిసి రాలేదు మరి!

సాలోచనగా బెంచీమీద కూలబడి, చొక్కా విప్పుకుని 'సరేలే 'ఫస్టు' తారీఖున 'పెన్ష'నందిన తరవాతనే వెళతాను మించిపోయిందేముందీ? నేనక్కడికి చేరేసరికి అష్టమి వస్తుంది కూడాను' అని పైకి అన్నాడేగాని గుండెలో ఏదో వేన్నీళ్లజల ఊరుతున్నట్టయింది శీతారామయ్యకి. నాన్న ఎంత ఉద్వేగం అణుచుకున్నాడో రాధ తలుపుసందులోనించి గమనిస్తోనే వుంది.

ఉద్యోగం అహోరించినప్పట్నించీ వొచ్చిందంతా ఒక బొట్టు పెట్టెలోపోసి, ఖర్చులూ గట్రా పార్వతమ్మమీద వొదిలేసి ఊరుకోవడం అలవాటయిపోయింది తనకి. ఇహను ఆ అలవాట్లు మార్చుకోవాలి. బ్రతుకూ, బ్రతుకుమూల్యమూ ఎంతవరకూ కుదించుకోవాలో అడుగడుగునా లెఖ్ఖలు వేసుకొంటూ పోవాలి గావును. చాపక్రింద నీళ్లల్లే, తనకి తెలీకుండానే దరిద్రం ఇంట్లోకి

జొరబడుతోంది!

నిజానికి ఇంట్లో వాళ్లే తనని మభ్యపెట్టారు చాలావరకు. తన చుట్టలూ, సోడాలూ, రాత్రి చపాతీలూ నాగాలులేకుండా యథావిధిగానే వచ్చేస్తున్నాయి. ఏ కొరతా తనదాకా రానీలేదు వాళ్లు ఆదమరిచి ఏదో కొంత నిర్లక్ష్యంగానే, రిక్షాలకని తను డబ్బు వెచ్చిస్తున్నాడు. నెమరుకి తెచ్చుకుంటున్నాడు శీతారామయ్య.

మర్నాడు చుట్టచుట్టుకొంటూ అరుగుమీద బాసీపెట్టువేసుకుని కూచున్నాడు శీతారామయ్య. ఇంటిముందు కసవూడ్చి కళ్లాపి జల్లుతోంది వాణి. 'పనిమనిషి రాలేదా అమ్మా?' అని అడిగాడు శీతారామయ్య. 'దాన్ని రావద్దన్నాం నాన్నా' అన్నది వాణి, చెరిగిన జుత్తు ఎగదోసుకుంటూ. 'ఏమీ?' అన్న ప్రశ్న నాలికదాకావచ్చి 'అనవసరం' అని అర్థం చేసుకున్నాడు శీతారామయ్య. పెద్దమ్మవారు తక్కుతో తారుతో ఇంట్లోకి తమాషాగా అడుగుపెడుతోంది!

అసలు ఇట్లాంటి పరిస్థితి గాబోతుందని ఉద్యోగముండగానే పసిగట్టాడు శీతారామయ్య. అట్లాంటి రోజు రాకుండా ఎన్నో కాపుదలలు పెట్టుకొంటూ వచ్చాడు పాపం. ఎన్నోయాతనలు సహించాడు. ఎంతో కంజాయింపుగా, ఒక 'ప్లాను' ప్రకారం జీవితానికి గట్లు వేసుకుంటూ వస్తున్నానని అనుకున్నాడు. ఆ కష్టాలూ, నిష్ఠూరాలూ, మాటిమాటికీ లెఖ్ఖవేసుకోడాలూ, ఆ గణింపులూ గుణింపులూ, మీదబడ్డ ఖర్చుల్ని ముందు వొదిలించేసుకుని అత్యవసరం కాని ఖర్చులు వెనక్కి నెట్టా చెయ్యా ఆ బాధలన్నీ బాధాకరంగా అవుపించనే లేదానాడు. ఎప్పుడో సుఖపడతామని శ్రమించడంలోనే వున్నదేమో సుఖం! ఇప్పుడు శ్రమించడం చాలించి, సుఖాన్ని కేటాయింపుగా నొల్లుకోవాలని హైరానపడుతున్నాడు గావును. గీతాభవనంలో అప్పుడప్పుడు స్వాములవారి ముఖతా విన్నా, 'ఏదో ఊకదంపుడు వేదాంతం అని తమ 'సుపీరియర్'గా చప్పరిస్తూ వచ్చిన సత్యాలు కొన్ని కళ్లముందు భరతనాట్యం చేస్తూ వచ్చాయిామధ్య. కొడుకులింత అన్యాయం చేస్తారా తనని! కల కరిగిపోతోంది.

ఇహనేమి చెయ్యాలీ తను? 'ఎవళ్ల చాతనయినా వ్రాయించనా కుర్రకుంకలికీ?' అనుకున్నా డొకసారి. 'కొడుకులేమీ పంపడంలేదు' అని తనగోడు వెళ్లబోసుకుని, రాయబారాలు నడిపి వాళ్లని ప్రసన్నులుగా చేసుకోవాలా తను? పుగాకుపాయలు తీసుకుంటూ, కాడలవతలికి విసిరేస్తూ హాలులో తచ్చాడుతున్నాడు శీతారామయ్య. 'ఏమండీ' అని పిలుపు వినిపించింది వెనకాతల. 'ఇట్లా రండి' అని మూల గదిలోకి దారితీసింది పార్వతమ్మ. అడుగులో అడుగులేస్తూ నడిచివెళ్లాడు శీతారామయ్య. రాధారాణి 'ఏమిటా' అని కూడా రాబోయింది. 'పోయి పాలు పొంగొచ్చినయ్యేమో చూడు తల్లీ' అని పంపించేసింది పార్వతమ్మ. వేలుముడిలో మందారపువ్వు తురుముకొంటో, 'చూడండి ఇంత యిల్లు మనకెందుకూ? క్రితానికి మల్లే ఒక చిన్నభాగం అద్దెకు తీసుకుంటే సరిపాయె. ఇదివరకు గడవలే? ఇప్పుడు గడవక పోతుందా?'... అర్థమయ్యింది శీతారామయ్యకి. తను సరేసరి, ఇన్నాళ్లూ కొడుకుల దగ్గరనించీ అంతకు కొంత రాబట్టే సూత్రమేమిటా? అని మల్లగుల్లాలు పడిపోతున్నాడు. ఇంకా తన దృష్టి మబ్బులవెనక విమానయానం చేస్తూనేవుంది. పార్వతమ్మకి చదువూ చట్టబండలూ లేవుగాని, ఒక్కొక్కసారి దాని బుర్ర మహాచురుగ్గా పనిచేస్తుంది.

అనుకుని దవడలు కొనగోట సన్నగా గీరుకున్నాడు శీతారామయ్య.

'అవును అంతకన్నా చిన్నభాగమే తీసుకోవాలీదఫా' అని నిట్టూర్చాడు.

'వెళ్లి చూడండి మరి అవతల వీధిని రాజన్న గారింట్లో ఒక చిన్నభాగం ఖాళీఅయింది. మొన్న పేరంటానికి వెళ్లినప్పుడు చూశాను. చిన్నగదులైనా ఒబ్బిడిగా వున్నాయి. నూతినీళ్లు కొబ్బరినీళ్లల్లే చవ్వలుగా వున్నాయి. పప్పు ఉడుకుతుంది. ఫరవాలేదు' అని చక్కాబోయింది పార్వతమ్మ. అంటే అప్పుడే ఇల్లు మార్చాలన్న నిర్ణయమూ, కొత్త యిల్లు పరామర్శించడమూ జరిగిపోయినయ్యన్న మాట. 'సరే' అన్నాడు.

ఇల్లు మారారు. గది వెనకాల గది వొకటీ, దాని నంటిపెట్టుకుని పెంకుటి వసారాలో చిన్న వంటిల్లూ ఏదోవుంది. అవతలవాటాలో ఇంటివారు ఉంటున్నారు. గాలి ఆడదు. నసిగింది వాణి. కిటికీలు తక్కువ. పెదిమ విరిచింది రాధ. వంటయింట్లో అరమరలు లేవు. పార్వతమ్మ వంటసామాగ్రి చకచకా సర్దేస్తోంది. ఈ 'ఫర్నిచ'రొకటి వచ్చిపడింది గదా అని విసుక్కున్నాడు శీతారామయ్య. దాని పుణ్యమా అని వంటింటికి ఒక చిన్న అటక వుంది పుల్లాపిడకా పేర్చుకుందుకు. అక్కడికీ, 'పొరుగింట్లో 'ఇన్‌కంటాక్స్ ఆఫీసరు' గారి భార్య నాగమణి మన తివాచీ చూసి ఎంత మురిసిపోయిందనుకున్నారూ, 'కావాల్నంటే' తీసుకోండి కొన్నధరకి కొంచెం తగ్గించే ఇస్తాము అనిచెప్పా' అని అందించింది పార్వతమ్మ అర్ధాంగీకారంగా మౌనం వహించాడు శీతారామయ్య. అది పూర్ణాంగీకారంగా ఎంచుకొని తివాచీ అమ్మేశారు. ఇంకా నయం, విరుచుకుని మీదపడతాడేమో ఈయన అనుకున్నది పార్వతమ్మ. దాని తరవాత ఒకదాని తరవాత వొకటి 'టీసెట్లూ' 'రౌండు' అద్దాలూ, 'టేబిలు' ముందు 'రాకింగ్ ఛెయిరూ,' 'ఎక్కోరేడియో సెట్టూ' అన్నీ విడుదలకానూ, ఇల్లు విశాలమైనట్టు సదుపాయంగా అమరనూ జరిగింది. 'లేకపోతే ఇల్లు చూడబోతే కోళ్ల గూడూ ఇంటో 'ఫర్నిచ'రేమో తలకి మించిపోయెను హమయ్య' అని ఊపిరి తీసుకుంది పార్వతమ్మ.

సంసారం పుష్పక విమానంలాంటిది. ఎక్కడి కక్కడే కుంచించుకుంటుంది, విస్తరిస్తుంది పరిస్థితి వొత్తిడినిబట్టి...

కాఫీలు కట్టిపెట్టారు. చిరుతిళ్లు తగ్గించారు. సినిమాలకి తిలోదకాలిచ్చారు. చెట్టుకింద బ్రతికేవాళ్లు లేరూ అనుకున్నాడు శీతారామయ్య. ఖర్చులు బొటాబొటీగా సరిపోతున్నాయి.

*　　*　　*

ఉద్యోగమున్నన్నాళ్లూ సంసారచక్రం హుందాగానే తిప్పాడు శీతారామయ్య. అప్పుడు జీతపురాళ్లు కళ్ల జూచేవాడు. భూమిమీదవచ్చే అయివేజు ఇంటికి కావలసిన గింజలమేరకేఅయినా, అంతకు కొంత ఆదుకొనేవి. తను ఉద్యోగం చలాయిస్తున్నప్పటికన్న, ఉద్యోగం విరమించిన తరవాతనే రాజదర్బారుగా వెళ్లమార్చుకోగలను అని ఒకప్పుడు కొడుకులిద్దర్నీ చూచుకుని గర్వంగా తిరిగిన రోజులున్నాయి. కుర్చీలో కూచుని కాళ్లు ఊపుకుంటూ పుగాకుపాయలు తీసుకొంటోవుంటే 'నీకెమయ్యా నీ పిల్లలు సింహపు పిల్లలు' అని ఎదురింటి కాంట్రాక్టరు విశ్వేశ్వరయ్య తనని

అగ్గిస్తుంటే ముసిముసిగా నవ్వుకున్నాడు శీతారామయ్య.

* * *

వాణి 'పి.యు.సి.' ప్యాసయింది. ఎవర్నీ అడక్కుండానే చదువు చాలించి ఇంట్లో అమ్మకి సాయంగా వుంటోంది. రాధారాణి 'పి.యు.సి.' లోకి వచ్చింది పెరట్లో మెట్లమీద కూచుని, మోకాళ్ల మధ్య అరచేతుల్లో చంద్రబింబంలాంటి తల పెట్టుకుని, 'ఇక నన్ను చదివించరటే?' అని అడిగింది పార్వతమ్మని. స్నానానికి నీళ్లు తొరుపుతున్న పార్వతమ్మ ఉలిక్కిపడి. 'హయ్యోరాత నిన్ను చదివించాలనే అనుకున్నారమ్మా నేను నోచిననోము లిట్లా తగలడినై' అని కంట తడిబెట్టింది. ఆ దెబ్బతో రాధ మరి తీసుకురాలేదాప్రసక్తి.

మొదట్లో రాధారాణి భిలాయ్‌లో అన్నయ్యతో వుంటూ అక్కడ 'బి.యస్.సి' చదువుదామను కుంది. అది నిర్ణయమై పోయినట్టే అనేసుకుంది కూడా. తన 'క్లాస్‌మేట్స్'తో గప్పాలు కొట్టనూ కొట్టింది. పెళ్లిలో పెద్దవదిన చెవిలో చల్లగా వూదనూ వూదింది. పానుపుమీద అన్నయ్యమీద పితూరీలుచెప్పి, సంప్రదాయ విరుద్ధంగా వదినపక్షం వహించి, ఆవిణ్ణి కొంచెం మంచి చేసుకుని పునాది కట్టుదిట్టం చేసుకుంది కూడా. 'భిలాయ్‌లో వొదినా నువ్వూ నేనూ వొకటి. అన్నాయికి సిగరెట్లు తగ్గించే పని నా వంతూ, స్నేహాలు తగ్గించే పని నీ వంతూ సరేనా?' అని వదినగారి బుగ్గగిల్లి, గడ్డం మునివేళ్లతో పైకెత్తి కళ్లల్లోకి చూస్తూ తను కవ్విస్తే, 'సిగరెట్లా? పాడువాసన! ఆ అలవాటు నేను వొదిలిస్తాగాని, స్నేహితాలు తగ్గించడమెందుకోయ్ అందులో నీకు కాబోయే వరుడున్నా ఉండవచ్చును' అని ఎదురు ఛలోక్తి విసిరింది కూడా ఆవిడ.

పెద్దన్నయ్య పెళ్లికనీ, చిన్నన్నయ్య పెళ్లికనీ భారీగా ఒక్కబిగిన పురమాయించి తీసుకున్న 'పేరగాన్ ప్రింట్' వోణీలూ, నైలాన్ పరికిణీలూ, క్రేప్ సిల్కుచీరలూ, సాటిన్ జంపర్లూ, మొఖమల్ స్లిప్పర్లూ అన్నీ చిరుగుపట్టినై. వాటిస్థానే, ఛీటీ గుడ్డలంగాలూ అంబికా పాప్లిన్ వోణీలూ వచ్చినై. తలగడలకీ, పరుపులకీ, పందలపాకమిల్లుగుడ్డలవతరించినై ఒకదాని తరవాత వొకటి. శీతారామయ్య మామూలుగా ఇరవై నంబరునేత పంచెలోకి దిగినా, కొమార్తెలని చూచుకుందుకని వారూ వీరూ వచ్చి పోతున్నారాయెను, అప్పుడు పైకి తియ్యవచ్చును అని మల్లు పంచె ఒకటి ట్రంకుపెట్టె అడుగున భద్రంగా అట్టేపెట్టుకున్నాడు.

ఆ మధ్య పండగలకనీ పబ్బాలకనీ ఆ మామయ్య అక్కడినించీ ఈ మామయ్య ఇక్కడినించీ సరాసరి ఆహ్వానాలుపంపారు, అల్లుళ్లిద్దరూ భార్యాసమేతూ అత్తవారిళ్లకి తర్లివెళ్లేవాళ్లు తిరిగి వెళ్లిపోయింతరవాత సెలవచాలక మధ్యేమార్గంతో దిగడం పడలేదని చల్లగా తనకో ఉత్తరం ముక్కపడెయ్యా, శీతారామయ్య గమనిస్తూనే వున్నాడు. ఒకసారి విజయ రాఘవంగారు ధ్యానం బేరమ్మీద ఏలూరు విచ్చేసినప్పుడు దీపావళి బహుమతికింద అల్లుడు వెయ్యిన్నూట పదహార్లు డిమాండ్ చేస్తున్నాడని ఫిర్యాదుచేసి, 'ఒక ఉత్తరం వ్రాయండి దయచేసి' అని తన సిఫార్సు కోసం అంగలారుస్తున్నట్లు మొహం పెట్టాడు. భోజనానంతరం తమలపాకులు నములుతో వాళ్లిద్దరూ ఎన్నిపండుగలకి ఎంతెంత గుంజుకొనిపొయ్యారో అనుకోకుండానే బైటపెట్టేశాడీయన. దానితో మామ అల్లుళ్లు ఎంత దోస్తీగా ఉంటున్నదీ పూర్తిగా అవగాహనయింది శీతారామయ్యకి.

ఎటొచ్చీ తనూ, తన భార్యారత్నమూ, పెళ్లికెదిగున్న ఆడకూతుళ్లూ కేటాయింపయినారన్నమాట. వియ్యంకుడయినా ఇంటికి వచ్చినపుడు విలువగల 'ఫర్నిచ'రుండాల్నే ఏమయిందీ అని అడగకుండా వుంటాడా అని ఎదురుచూసాడు శీతారామయ్య. కానీ, అదేమీ పట్టినట్టులేదాయనకి; ఏదో దూరపుచుట్టంలానూ, పనిమీదవచ్చి పనిలో పనిగా పలకరించిపోతున్నట్టూ, ఆయనకీ తనకీ ఉండుకున్న బంధుత్వం, ఏదో నిమిత్తమాత్రమయిందన్నట్టూ ఉన్నదాయన ధోరణి.

కొడుకులదగ్గరికి వెళ్లిరానా ఒకసారి? అనుకున్నాడు శీతారామయ్య. కాని ఎక్కడ భిలాయి? రైలుఛార్జీలే బోలెడయిపోతై, ఏమిదారి? ఆలోచనలో పడ్డాడు.

* * *

అంతలో ఒక చిన్న అవకాశం చిక్కింది. విజయ రాఘవంగారి ఏకైకపుత్రుడు పురుషోత్తానికి ఏలూరులో సమంధం నిశ్చయమయింది. రెండూ జమిందారీ కుటుంబాలే. శీతారామయ్యకి ఆహ్వానం వచ్చింది. శుభలేఖలూ నేరుగా అటు బిలాయ్‌కీ, ఇటు హైదరాబాద్‌కీ రవాణా అయ్యేవుంటాయి. కుర్రవాళ్లిద్దరూ, కోడళ్లని వెంటబెట్టుకుని రానేవస్తారు అనుకున్నాడు శీతా రామయ్య. వచ్చి తిన్నగా విడిదిలోనే అత్తవారిబలగంతో కొంతసేపు ఐక్యమై, పెళ్లి అయింతరవాత గాని తన యింటికి రాకపోవచ్చని రూఢి చేసుకున్నాడు. అనుకున్నట్టు అక్కణ్ణే దిగారు. కాని విడిదిలో పెళ్లివారి రద్దీమూలాన, స్నానపానాదులు సదుపాయంగా అమరవనిపించి, ఇద్దరూ తక్షణం ఇక్కడికే వచ్చేశారు. రిక్షా దిగీదిగగానే తిన్నగా వంటింట్లోకి వెళ్లిపోయి, బాణలిలో నూనె వేస్తున్న అమ్మపక్కకి పీట జరుపుకుని 'అమ్మా, వచ్చేశా' అని చతికిలబడ్డాడు నళిని. పార్వ తమ్మ ఉలిక్కిపడి, 'అయ్యో నాయనా ఎప్పుడు వచ్చావురా?' అని వంటావార్పూ అలానే వొదిలేసి, కొడుకుని అమాంతం వాటేసుకుని, తల నిమురుతో, 'ఎంత నల్లబడిపోయావురా తండ్రీ అక్కడ తిండిపడలేదా? ఆ ఉక్కుఫ్యాక్టరీలో నిప్పు కొలుములపక్కనేమిట్రా ఉద్యోగమూ?' అని ప్రశ్న తరవాత ప్రశ్న పుంఖానుపుంఖంగా విసురుతోనే వుంది. 'ఒక్కొక్కటే అడగవమ్మా చెబుతానూ అన్నీ ఒక్కసారే అడిగితే ఎట్లా?' అని ప్రీతిగా నవ్వుతో నిలబడ్డాడు నళిని. ఆమె కాలర్ సరిచేస్తోంది. చొక్కా గుండీలు తెగతిప్పేస్తోంది. పూలుకోటుమీద చెదురుగా రాలిన రైలుబొగ్గు కొనగోట దులుపుతోంది.

రాముూ వచ్చాడు భార్యా సమేతూ.

శీతారామయ్యకి లోపల చిమచిమలాడుతోంది. పరకాయించి చూచాడు. పిల్లలిద్దరూ కందపట్టి, నేవళం తేరి, లంకగుమ్మడికాయలల్లే వున్నారు. నళిని 'పాటింజన్ సూటు' మీద వున్నాడు. రామం 'త్రికాసిల్క్ ఫుల్ ట్వీడ్ సూటు' మీద వున్నాడు. ఒకడు చిక్కిపొయ్యాడంటుంది. ఒకడు నల్లబడ్డాడంటుంది ఈవిడ! ఎంత నిగ్రహించుకొందామనుకొన్నా నవ్వు ఆపుకోలేక పోతున్నాడు శీతారామయ్య. తనకేమీ పంపకపోతే మానె, పిల్లలిద్దరూ, చక్కా, ఆరోగ్యంగా, ఉల్లాసంగా, 'గెజెటెడ్ ఆఫీసర్' హొదాలో వెలిగిపోతున్నారు అనిపించి శీతారామయ్యకి. ఒక క్షణం తన్మయత్వం కలిగింది కూడా. పెరట్లో తులసి కోటలో నీళ్లు పోస్తున్న వాణి వెండిగ్లాసు తులసి కోటలోనే వొదిలేసి ఉదుటున పరిగెత్తుకొచ్చింది. కుంపటి పొయ్యిదగ్గిర చతికిలపడిన

రాణి, ఊదుతున్న వెదురుగొట్టం నేలమీద పెట్టేబదులు కుంపట్లోనే వొదిలేసి బిలబిలలాడుతూ వొచ్చేసింది. అన్నయ్యలిద్దరూ కుర్చీలమీద కూచున్నారు. వదినలిద్దరూ ఎదురుగా చిరిచాపమీద కూచున్నారు. అన్నయ్యలిద్దరి మధ్యా చోటుజేసుకుంది వాణి. వదినలిద్దరి మధ్యా ఇరుక్కుని కూచుంది రాధారాణి. నళినీమోహన్ 'ఫస్ట్‌క్లాస్' కంపార్ట్‌మెంట్‌లో తాముపడ్డ ఇబ్బందుల్ని పెద్ద గలభాగా అదోకథలా, చెప్పుకుపోతున్నాడు. పెద్దవదిన విజయ ఇంగ్లీష్‌లోనేగాని తెలుగులో మాట్లాడదు. మధ్య మధ్య, 'పొండీ మీతో ప్రయాణం చెప్పొచ్చారూ ఎక్కడపడితే అక్కడ హల్లో అని ఎవరో ఒక యంబ్రహ్మ తారసిల్లా, మీతో వికవికలూ పకపకలూనూ. 'ప్లాట్‌ఫారంమీద!' బండి కదులుతోంది మహాత్మా అని జ్ఞాపకం చెయ్యాలయ్యో అడుగుడక్కీ. అబ్బ పగవాడికైనా వద్దు' అని జడలో డిసెంబర్లూ, బుగ్గలమీద గులాబులూ ఏకమయ్యేలా ఒక్కవరసని ఎగతాళి పట్టేస్తోంది. డా॥ రామచంద్రం సరేసరి, బయల్దేరేటప్పుడు తనపెట్టే బేడాతోపాటు తన పెళ్లాన్ని కూడా ఒక శాల్తీ కింద లెఖ్ఖపెట్టుకుని, ప్రయాణంలో మధ్యస్తంగా ఆరాతీసుకునేటప్పుడు మాత్రం ఆవిడగారిని లెఖ్ఖలో వొదిలేసుకుని గాబరాపడిపోయిన ఘట్టాన్ని, తన తెలివి తక్కువ కప్పదేలా, అదే ఒక ప్రజ్ఞకిందా పెళ్లానికి పెద్ద నవ్వొచ్చేలా, హాస్యంగా మార్చి, మలిచి, విడ్డూరంగా చెప్పుకు పోతున్నాడు. అన్నయ్యలెట్లా మాట్లాడుతున్నారో, వదినలు అన్నయ్యలనెట్లీ తురస్కారిస్తున్నారో, వాళ్లచేతులు, పెదిమలు కళ్లు... ప్రతిచలనమూ, ప్రతిభంగిమలూ, అస్తారుబతంగా, అమాయకంగా పరిశీలనగా చూస్తో కూచుండిపోయారు అక్కచెల్లెళ్లు. అన్నయ్యలిద్దరూ తమ ప్రపంచంలోకి రావడానికి కొంత టైమ్ తీసుకుంటారని అర్థమయిపోయింది ఇద్దరికీ. మధ్య మధ్య 'లెదర్ బ్యాగ్' తెరిచి పెద్దవదిన ఏవో తీపి సరుకులు నములుతోంది. 'పీన్ పాపిడి' డైమన్ అచ్చొకటి విరిచింది. పక్కనవుంటే దేవిరిగొట్టు మొహాలనుకుంటుందేమోనని లోపలికి తుర్రుమన్నారు వాణీ రాధారాణీ. తరువాత వచ్చిచేరారు. వాళ్లు కాస్త అటూ ఇటూ యధాలాపంగా చూస్తేచాలు ఏమి కావాల్నో అని వాణికి వాణీ రాణీకి రాణీ రివ్వునలేచి తయారైపోతున్నారు. అన్నయ్యచేతి 'రిస్టువాచీ' చూస్తోంది వాణీ. మణికట్టు పైకెత్తి పట్టుకుని 'క్యాలెండర్' కూడా ఉందేవ్ అని ఒక్క అరువు అరిచింది. వొదిన రాళ్ల నెక్‌లెస్ పతకంలో పొదిగివున్నది కెంపా, పగడమా అని ఆలోచిస్తోంది రాధ.

పిల్లలొచ్చారని అరటిపువ్వు పాటోళీ చేస్తోంది పార్వతమ్మ. నేతి తాలింపు ఘుమఘుమలు రెపరెప లాడుతున్నాయి. ఫలహారాలు నేను తెస్తానంటే నేను తెస్తానని వంతులుబోయారు వాణీ, రాధారాణీ. కొంతసేపటికి 'సరే తీసుకురావే అంటే నువ్వే తీసుకురా' అని ఇద్దరూ బిడాయించు క్కూచున్నారు. చివరికి ఇద్దరికీ తప్పలేదు. పెద్దవదినకీ పెద్దన్నయ్యకీ పెద్దచెల్లెలువాణీ, చిన్నవదినకీ చిన్నన్నయ్యకీ చిన్న చెల్లెలు రాధా ఖాయం చేసుకున్నారు.

ఫలహారాలయినై. కాఫీలు సేవించారు. నూతి పళ్లెందగ్గర 'ప్లేట్లు' కడుగుతో 'పెద్దవదిన మూతి మీద చిన్నమీసముందేవ్' అని కిసుక్కున నవ్వింది రాధారాణి. 'ఓసి నీ దుంపతెగా వింటారే' అని ఒక మొట్టికాయ మొట్టింది వాణి. పెద్దన్నయ్య మాట్లాడేటప్పుడు తల వోరగా పెడతాడనీ, చిన్నన్నయ్య తల ఎగరేస్తాడనీ, పెద్దవదిన చకచకా మాట్లాడుతుందనీ, చిన్నవదిన మాటలు మింగేస్తుందనీ అనుకున్నారు. అంతవరకూ 'ఎగ్రిమెంట్' కుదిరింది ఇద్దరికీ. పెద్దన్నాయి కొంచెం

వాళ్లుచేసాడని వాణీ, కాదు చిన్నన్నాయే లావెక్కాడని రాణీ ఇద్దరికీ వాదోపవాదాలు చెలరేగినయి. చివరికి 'నీది మట్టిబుఱ్ఱ' అంటే 'నీది చవిటిబుఱ్ఱ' అని తెగనాడుకుని, 'అమ్మ నడుగుదాంపద' అని పందేలు వేసుకున్నారు. దొడ్లో ఏదో గలాటా జరుగుతోందనుకుని, పార్వతమ్మ పని వదిలి వొచ్చేసింది.

అరుగుమీద కూచుని సూరపరాజుగారి దగ్గర ఎరువు తీసుకున్న దినపత్రిక చదవకుండానే మడిచి పట్టుకుని 'వీళ్లంతా ఎట్లా ఇంత ఉల్లాసంగా ఉండగలుగుతున్నారు?' అని ఆశ్చర్యపోతున్నాడు శీతారామయ్య. కిటికీ చీకట్లో గూడా కొంతసేపటికి చుట్టూవున్న వస్తువులు ఒకదాని తరవాత ఒకటి, నెమ్మనెమ్మదిగా లీలగా అవుపించడం ప్రారంభిస్తాయని శీతారామయ్య కింకా అనుభవంలోకి రాలేదు. జీవితం ఎట్లా ఎదురయితే అట్లా స్వీకరించగల సహనం ఆడదానికున్నట్టు మొగాడికి సాధ్యంకాదేమోనని మొట్టమొదటిసారి తెలుసుకున్నాడు కూడా. అంతే కంచం ఖాళీ అయింతరవాత కంచం కింద మెతుకుల మీదికి దృష్టిపోతుందిగావును! గాఢంగా ఊపిరి తీసుకున్నాడు శీతారామయ్య. మాటల సందర్భంలో వాళ్లిద్దరూ భార్యా సమేతంగానూ, బావమరుదుల్నీ మామగార్లనీ వెనకేసుకునీ, ఒకసారి ఢిల్లీ, ఒకసారి కలకత్తా, ఏ స్నేహితుడిపెళ్లి అనో, ఏ అఖిల భారత ప్రదర్శనమనో, ఆడపాతడపా, ఏ మొక్కుబళ్ల వంకనో, ఇటుకంచీ, కాళహస్తీ, మహాబలిపురం, మద్రాసూ చక్కర్లుకొట్టి వస్తోపోతూ ఉండడమూ గట్టా అక్కడి వింతలూ విశేషాలూ వాళ్లు చెప్పుకోవడంలో గ్రాహ్యమవుతోనే వుంది. ఇన్నిటికి దస్తు ఆమరగా లేంది. తనకి పంపాలిసిన యాభైకీ పాతికకీ మినహాయింపు లొచ్చినయ్యా? రాస్కెల్స్! పై పెదిమ కిందపంటితో నొక్కిపెట్టి తలవంకించి ఊరుకున్నాడు శీతారామయ్య.

తరువాత తనూ కొడుకులిద్దరూ ఎంతోసేపు ఇష్టంగానే మాట్లాడుకున్నారు. నళిని తను పనిచేస్తున్న ఉక్కు ఫ్యాక్టరీలో ఉద్యోగ నిర్వహణకి సంబంధించిన వివరాలూ, తన అజమాయిషీలూ, తను కనిపెట్టిన కొత్త ఇంజనీరింగు పద్ధతులూ, 'రష్యన్ ఇంజనీర్ల' కలుపుగోలుతనమూ, తనకి తెలియని 'టెక్నికల్' పదాలు దొర్లిస్తో ఏకర్నించాడు. డాక్టర్ రామం తన ఆస్పత్రిలో 'డ్యూటీలూ,' నర్సుల వేషభాషలూ, 'ఆపరేషన్లూ,' మొన్న నీమధ్య పెద్ద డాక్టరు మీదవచ్చిన అభాండాలూ, 'మెటర్నిటి వార్డు'లో పసిబిడ్డలు మారుగుల్లయిన కేసు వివరాలూ ఆషామాషీగా చెప్పుకుపోతున్నాడు. సావధానంగా వింటూపోతున్నాడు శీతారామయ్య. ఎంతకీ వాళ్ల జీతాలెంతో, ఖర్చులేమాత్ర మవుతున్నాయో, ఖండితంగా తేల్చుకోలేక పోయాడు. ఒకడు అదేదో 'స్పెషల్ పే' అంటాడు. ఒకడు కంపెనీ 'ఎలవెన్స్' అంటాడు. ఇకపోతే ఖర్చులు ఒకడు 'డెవలెప్‌మెంట్‌నెస్' అంటాడు. ఒకడు 'మేగజీన్ కాన్‌ట్రిబ్యూషన్' అంటాడు. అదీ ఇదీ కలిపి, అందులోనించీ ఇది పారేసి, కురదలా తేల్చుకోమన్నట్టు గడబిడగా చెప్పుకుపోతున్నారిద్దరూ. పాలకి రూ. 40/- అని వొకడూ, కాదు నాకు యాభై అవుతున్నాయని ఒకడూ ఏ రేటున కొంటున్నదీ ఒక్కడూ తేలదు. మరి ఆ అంకెని ఈ అంకెపెట్టి భాగారిస్తే, దినానికున్న ఇరవై నాలుగుగంటలలోనూ ఎవరెన్ని శేర్లు తాగేస్తున్నారో నికరంగా తేలనే తేలుతుందాయెను. ఆ నళిని మరీనూ. నక్కజిత్తులు వాడివి. పాలసంగతి ఎత్తుకొని, పాలసరఫరా విమర్శించి, ఉత్తరాది వాళ్లు పాలతోనూ పంచదారతోనూ ఖీల్‌మోహన్ అనీ, బాసంతి అనీ ఎన్నెన్ని తీపి సరుకులు చేసుకుంటారో ఉటంకించి, అయినా

పంచదార అంత ఆరోగ్యకరమైన పదార్థం కాదన్న ఉపదేశంతో శాఖా చంక్రమణాలుపోయి, 'నానా, నీకు షుగరన్నావు ఎట్లా వుందీ?' అన్న కుశలప్రశ్నలతో ఉపసంహారానికొచ్చి అసలు సంగతి తప్పించేశాడు. శీతారామయ్యకి విసుగ్గా వుంది.

ఎటొచ్చీ రామచంద్రం కొంచెం మెతక. కల్పనా కథలు చకచకా అనర్గళంగా అల్లడం చాతగాక, మధ్య మధ్య నట్టుతో, 'మారిదేవుడు మేలు చేస్తే' అని గెడ్డాన్ని బొటనవ్రేలూ చూపుడు వ్రేళ్ల మధ్యని పుణుక్కొంటూ, అయోమయంగా, ఏమీ పాలుపోక 'మీకోడలు కొంచెం ఖర్చుమనిషి' అని నాలిక జారాడు. మరి ఆ మాట, ఆ కోడలు ఎక్కణ్ణించి విన్నదో, ఎంత జాగర్తగా విన్నదో, రివ్వున హాలులోకి దూసుకొచ్చి, 'చూసారా మామయ్యా ఆయన దుబారాలన్నీ దాచుకుని నామీదకి నెట్టేస్తున్నారు. ముప్ఫయ్యారు సూట్లెందుకు చెప్పండీ? తాజమహల్ ఒకసారి చూస్తే చాలదూ? ఎండలో ఒకసారీ, వెన్నెట్లో ఒకసారీ చూడాల్నా? మొన్నటికి మొన్న పుస్తకంలో వందరూపాయల నోటు పెట్టి, మర్చిపోయి, 'లైబ్రరీకి' వాపసు చెయ్యలేదూ' అని బి.యె. ప్యాసయినా, కళ్లూ చేతులూ తిప్పే అలవాటు అంతరాళంలోనించి పైకుబికి వచ్చినట్టయి, ఆయనగారి అవకతవకలన్నీ ఒక్కపెట్టున చెరిగిపోసింది. డాక్టరు రామంగారుమాత్రం తక్కువ తిన్నారా? తన భార్యా రత్నం పెట్టెలో ఎన్ని చీరలున్నాయో, 'టాక్సీమీద నెలకెన్నిసార్లు 'షాపింగ్'కి వెడుతుందో ఎన్ని 'టేబిల్ ఫాన్స్' కొనిపించిందో, 'వద్దే మనకెందుకు? మనం సామాన్యకుటుంబీకులం, సంసార్లమా గుండా గొయ్యాలమా?' అని శతపోరినా అదిగో ఆ 'రిఫ్రిజిరేటర్' కొనేదాకా ఎట్లా గుంజిపెట్టిందో, ఆఘటాలన్నీ, కొళాయి తిప్పగానే నీళ్లొచ్చినట్టు ఏకధాటిని ఏకరువు పెట్టేశాడు. దానాదీనా, చిలికి చిలికి గాలివానయింది. మాటకి మాటతెగులూ, నీటికి నాచు తెగులూ అన్న సామెతగా, ఇద్దరూ ఢీ అంటూ ఢీ, నువ్వంటే నువ్వు అని చెలరేగిపోయి, ఒకళ్లమీద ఒకళ్లు విరుచుకునిపడి, నానారభసాచేసి వదిలిపెట్టారు. అటు వాణీ రాణీ పార్వతమ్మా రెక్క పట్టుకుని ఇద్దర్నీ వెనక్కిలాగినా వినలేదు. పైపెచ్చు వారించినకొద్దీ రెచ్చిపోయారు కూడా. ఆఖరికి చిత్రంగా, ఎంతకీ సమవుజ్జీ అయిపోతున్నదే, అనిపించి గావాల్ను, ఆ కోడలు ఇహ వాక్చాతుర్యం చాలించి, గప్పున కన్నీళ్లలో కరిగిపోయి ఆడంగుల చేతిలోని అమోఘమైన అస్త్రాన్ని గురిచాచి మరీ ప్రయోగించింది. దానితో సద్దుమణిగింది. వాణీ చినవదినని లోపలికి బలవంతాన తీసికెళుతూ, 'చాల్లే ప్రతాపాలు' అని చిన్నన్నయ్యవంక ఉగ్రంగా చూచింది. ఎర్రని మొహం మరీ ఎర్రబడిపోయి, పైటకొంగుతో కళ్లొత్తుకుంటూ, భుజమ్మీద వేసిన వాణీ చేతులు విదిలించుకుంది కోడలు. అక్కడికి, ఇందాకట్నించీ పేట్రేగిన కలహానికంతటికీ తామే కారణమైనట్టూ, అన్నయ్యని పనిగట్టుకుని తామే ఉసిగొల్పినట్టూ మొహం పెట్టిందావిడ. ఆ వైరంలో తనూ ఒక భాగస్వామినే అన్నట్టు వంటింటోనించీ చెమట తుడుచుకొంటూవచ్చి, కోడల్ని అనునయిస్తూ కూచుంది పార్వతమ్మ.

ఈ రణరంగంలోకి ప్రవేశించకుండా అసింటావుండి గమనిస్తున్నది శీతారామయ్య. ఆయనకి పట్టుకున్నది ఒకేఒక్క సందేహం. ఈ రగడంతా ఎత్తుగడా, నిర్వహణా, ముగింపూ అన్నీ ముందే పన్నుకుని, 'రిహార్సల్స్'తోసహా 'ప్రాక్టీసు' చేసుకుని ఇక్కడ తెర ఎత్తారారా వీళ్లు? ఏమో ఎంతకీ తగ్గరు! ఇదంతా నెల నెలా తనకి పంపడానికి సాధ్యమయ్యేదెంతా అన్న సమస్య తెగకుండా, అస్పష్టంగా పడెయ్యాలని ఎత్తా? కాని అనుకోకుండా చిలవలు పలువులుగా

పెరిగిపోయిన ఆ ' దయలాగు'లోనుంచి వీళ్లలో లోపల సాగుతున్న స్వయంపాకాలూ, చేస్తున్న దుబారాలూ, బహిర్గతమైన మాట మాత్రం నిజం! నళిని అట్లా దొరకని మాట నిజమే. వాడి భార్య విజయ సరేనని అదొక కూపి. ఇద్దరిద్దరే నిస్తరంగసముద్రాలు. తొణకరు బెణకరు.

అక్కడ పెళ్లి అయిపోయింది. పెళ్లి వారింటికి వెడుతోవస్తో కోడళ్లిద్దరూ మార్చి మార్చి కట్టుకున్న డెకరాన్ జరీచీరెలూ, ప్రింటెడ్ నైలాన్ చీరలూ, రుద్రాక్షంచు క్షీరాబ్ది పట్టు చీరలూ, ట్వింకింగ్ టెరెలిన్ జంపర్లూ కళ్లు జిగేల్మనిపించి, వెనక్కి తిరిగి తిరిగి మరీ చూచారు అక్కా చెల్లెళ్లిద్దరూ. చూచిచూచి కొయ్యబారి పోయారు. ఇంతవరకూ కోడళ్లిద్దరూ వంటయింట్లో అడుగు పెట్టలేదు సరిగదా, ఆ ధరిమేనా వెళ్లిన పాపాన పోలేదు. కోడళ్లు చదువుకున్న దొరసాన్లు కాబట్టి వాళ్లు వంటింట్లోకి వెళ్లకపోతే మానె, కొడుకులైనా, చెల్లాయిలిద్దరూ తమకి వొత్తులు వొత్తుతూ తమ దగ్గరనే ఉండిపోయిరి, వంటింట్లో ఆ తల్లి ముండవక్కర్తీ సతమతమవుతోందికదా, తమ మాటా మన్ననా, అత్తమామలంటే తమకి ఉండుకున్న భక్తి ప్రపత్తులూ, ఒలకబోసేది ఈ మూడు రోజులే కదా, కనీసం నటనకయినా ఒక్కరవ్వ అటుతొంగి చూడండే అని కలగజేసుకుని సూచించారా? అదీ లేదు.

రామూని పిలిచి ఒక చిన్నపని పురమాయించాడు శీతారామయ్య. పడమటి వీధిని కుటుంబయ్యని ఒకతనికి పదేళ్లయి ప్రోనోటుమీద బదులిచ్చాడు తను. వడ్డీ వశనపురమూ ఏమీ అఖ్ఖర్లేదు. అసలియ్యవయ్యా అంటే దిక్కూ దివాణమూ లేదింతవరకు. 'నువ్వేమో ఆఫీసరివి కాబట్టి, ఒకసారి ముదలకించు' అని పంపాడు. కుటుంబయ్యని రామూ ఎరుగును.

'వాడా? దొంగ రాస్కెల్! పలుకుతాడా? ఈ నోట్లేమిటి? బదుళ్లేమిటి?' అని నసుగుతోనే బూటూ సూటూ కోటూ బనాయించి, అరగంట 'టాయిలెట్టయి' బయల్దేరి వెళ్లాడు డా. రామ చంద్రం. వెళ్లి ఒక గంటలో రిక్షామీద దూకుడుగా వచ్చాడు వస్తూనే జయ్యిమంటూ, 'వాడా దగుల్బాజీ బాబూ నాయనా అంటే వాడిస్తాడా? ఇవ్వకపోనీ చెప్తాను. 'డొక్క వాలికలు చేస్తాను ఖబడ్దార్' అని చెప్పి వచ్చా చేతిలో హంటరు లేదు. తాట వొలిచెవాణ్ణి' అని కోటు గబగబ విప్పేసి వంకీకి తగిలించి బూట్లు విప్పేసుకుంటున్నాడు. కుర్చీలో కూచుని, ఎవరికో ఉత్తరం వ్రాస్తున్న వాడల్లా, ఆపి, పక్కకి తిరిగి 'ఏమయిందీ?' అని ప్రశ్నిస్తున్నాడు శీతారామయ్య. 'ఎనిమిది వందలు కాదు ఆరు వందలట దొంగ చూపులూ నంగిమాటలూ వాడూను. నోటు చూపించమంటే లేదటలుచ్చా ఆస్పత్రిలో 'స్పెషల్ వార్డు'ల్లో పోలీసు సూపర్నెంట్లు నాకోసం పడిగాపులు పడి వుంటారు ఒక్క 'ఆఫీసర్ని' తగిలించానంటేసరి సఫా ఏమనుకుంటున్నాడో బద్మాష్' అని అక్కడలేని కుటుంబయ్యమీద అదేపనిగా ఎగిరి పడుతున్నాడు డాక్టర్ రామచంద్రం.

నోటు వాడిదగ్గరెందుకుంటుందీ? మనం వాడి కప్పిస్తే, నోటు మనదగ్గరుంటుంది ఇదుగో అని డ్రాయర్లోనించి ప్రోనోటుతీసి, వేలుపెట్టి అంతవరకూ పడిన జమలు భయం భయంగానే చూపించాడు శీతారామయ్య. వాడు తనమీద ఎక్కడ పడతాడోనని భయంగానేవుంది లోపల. 'ఇదుగో వంద ఒకసారీ, యాభై యాభై దఫదఫాలుగానూ జమ లిచ్చినట్టు నమోదయినై. ఆ పద్దులు అసలు క్రిందనే ముట్టజెప్పినట్టు లెఖ్ఖపెట్టుకుంటున్నాడు గావును,' అని వేలితో

నిర్దేశిస్తూ, ఇష్టంగా నవ్వాడు శీతారామయ్య. 'ఎట్లాగయినా దొంగలెఖ్ఖలు నాన్నావాడివి. వాడికి నీతి నిజాయితీలేదు. దెబ్బ దేవేంద్రలోకమని అదే వాడికి మందు. ఇక్కడికి రానీ చెమడా లెక్క దీసేస్తాను. ఈ అసలేమిటో, వడ్డీలేమిటో అదీ ఇదీ కలిపి అందులోంచి ఇది తీసెయ్యడమేమిటో అంతా రావణా గోలగా వుంది. ఏమే బనియనిట్లా ఇవ్వు' అని లోపలికి చక్కాబోయాడు రామం. మొన్న భార్యతో కలబడినప్పట్నించీ వాడెత్తిన నరసింహావతారం ఇంతవరకూ ఉపసంహరించలేదు. మాట్లాడితే చిమ్మెట్టలా మీదపడుతున్నాడు.

తెల్లవారగట్ట జూట్‌మిల్లు మొదటి కూత కూసింది. ముందు గదిలో పడుకున్నాడు శీతారామయ్య. మట్టెల చప్పుడయితే వెనక్కి తిరిగిచూచాడు. పార్వతమ్మ 'చూడండి' అని మంచంకోడుదగ్గర నిలబంది. 'ఏమిటి?' అన్నట్టు చూచాడు.

'వాళ్లు రేపు వెళ్లిపోతున్నారు. మన సంసారం చూడబోతే ఇట్లా నీళ్లుగారి పోతుండెను! పిల్లల పెళ్లిళ్లమాట ఏమిటి? వాళ్లకువాళ్లూ మీకు మీరు ముభావంగా ఊరుకుంటే ఎలా?...' అంది 'సీరియస్'గా.

శీతారామయ్య లేచి కూచుని తలగోక్కుని 'చెబుతా చెబుతా చెప్పకపోతే ఎలా? సరే నువ్వు వెళ్లు...' అన్నాడు అటూ యిటూ చూచి... పార్వతమ్మ వెళ్లిపోయింది. నిజమే మరి. ఊరికేనె లోలోపల మధనపడడం, స్వగతంగా కారాలూ మిరియాలు నూరడం మినహా తనుచేసిన నిర్వాహకమేమిటి ఇంతవరకూ?

* * *

సాయంత్రం రామం ఒక్కడే ఉన్నాడు. ఆ మధ్య భిలాయ్‌లో పనిచేసిన, 'ఎగ్జిక్యూటివ్ ఇంజనీ'రొకాయన సెలవుమీద ఏలూరు వచ్చాట్ట. ఆయనగారి భార్య 'లేడీస్ క్లబ్బు' కొచ్చిందట. ఆమెతో భుజభుజాలు రాసుకుందుకని చక్కాబోయారు కోడళ్లిద్దరూ... వంటయింటో పాత్రలు గలగలలాడుతున్నాయి. వదినలు పురమాయించిన చామంతి పువ్వుల కదంబం గుచ్చుతోంది రాధారాణి.

'ఒరేయ్ రామం ఇట్రా' అని పిలిచాడు శీతారామయ్య. అంతలో నళినీ ఎక్కడినించో కొంపకి చేరుకున్నాడు. లేడికి లేచిందే ప్రయాణమని, మళ్లీ ఎక్కడికేనా ఉడాయించగలడు. పిలిచాడు శీతారామయ్య తల వంచుకుని టేబిలుపక్కని చిన్న బెంచీమీద కూచ్చున్నారిద్దరూ. 'ఏదో ముగ్గులోకి దింపుతున్నాడు నాన్న' అని లీలగా పసిగట్టారు సుపుత్రులిద్దరూ. కుర్చీమీద కూచుని టేబిలుమీదవున్న పేపర్‌వెయిట్లు సద్దుతూ ఉపక్రమించాడు శీతారామయ్య.

'ఏరా అబ్బాయిలూ నా 'పెన్షను' రూ 73/- వస్తోంది. మీకు తెలియందేముంది చూడబోతే పిల్లలు పెళ్లిళ్లు కావాలాయెను మరి అడుక్కునేవారు సమేతూ రెండువేలకి తక్కువ కట్నం అడగడంలేదు ఇట్లా వుంది పరిస్థితి. ఏమిచెయ్యమంటారు? ఏమిటి మీ వుద్దేశ్యం?' అని మెదలకుండా ఊరుకున్నాడు శీతారామయ్య... రామం ఎత్తుకున్నాడు. తనని గవర్నమెంటు 'లోన్'మీదనే చదివించారట అది తీదుస్తున్నాడట నెలనెలా వంద చొప్పున బలవంతాన 'ఇన్‌షూరు'

చేయించారట. దానికో దెబ్బ అవుతున్నాయట. హైదరా[illegible]
చిల్లపెంకులల్లే ఖర్చయిపోతుందట. పెళ్లి అయింతరవాతేగాని అంతవరకూ నెలనెలా ఏదో పంపిస్తోవున్నాడట. పొలాలమ్మించి చదువుకున్నవాళ్లు కొంచెం బాధ్యత వహించాలట. నళినివంక చూసాడు శీతారామయ్య. సమాధానం అల్లుకుందుకు అనుకోకుండా వ్యవధి చిక్కింది నళినికి... తల ఠీవిగా ఒక వైపు ఓరగా వంచి కిటికీలోంచి అవతలకి నిర్లక్ష్యంగా చూస్తో జవాబు. తనకీ 'ఇన్‌షూరెన్స్' బెడద వచ్చిందట. 'హౌస్ బిల్డింగ్ స్కీము'లో జేరమన్నారట. ఎవరో చెప్పాడు. దానితో ఇంటిస్థలం కింద వెయ్యిదాకానూ, 'షేర్ల'కింద కొంతా 'డిపాజిట్టు' చేశాట్ట ప్రతినెలా ఏదో వాక ఖర్చు వచ్చిపడిపోతోనే వున్నదట. అక్కడికీ తను పొదుపుగానే వుంటున్నాడట.

'ఒరే అబ్బాయ్ నా కుటుంబ ఖర్చులు భరించమని మిమ్మల్ని అడగడంలేదు నేను అది నేనే సర్దుకుంటాను సర్దుకుంటూనే వున్నాను ఆ బరువేమీ మీ భుజస్కంధాలమీద కెత్తను కాని ఆడపిల్లల పెళ్లిళ్లు ఎట్లా గట్టెక్కేనూ అని? ఆ బాధ్యత మీరు వహించక తప్పదు మరి' అన్నాడు శీతారామయ్య.

పచ్చివెలక్కాయ గొంతు కడ్డం పడినట్టు మిడుతూమిడుతూ చూస్తున్నారిద్దరూ. ప్రతిమెట్టుకీ తనే గుచ్చిగుచ్చి ప్రశ్న తరవాత ప్రశ్న అడగాలిసిన అదుగడుక్కీ గుర్తొస్తూనే వుంది శీతారామయ్యకి.

'మరి అక్కడ పద్దుల పుస్తకంలో పోగుపడి వున్నయిగా రూపాయలు అవి పట్రండి మరి.'

'అడిగాం నాన్నా. అది మా కివ్వరట వాళ్లు.'

'వాళ్లెవరు?'

'కోడళ్లు.'

'పద్దులు వాళ్ల పేర ఉన్నట్టా?'

'అవును.'

'అయితే వాళ్లనే పట్రమ్మనండి'

'వాళ్లు సంతకాలు చెయ్యరట.'

'మీతో తర్కమెందుకురా నాయనా వాళ్లిద్దరినీ మీదగ్గరకే పంపేస్తాను. ఎట్లా పెళ్లిళ్లు చేస్తారో చెయ్యండి నాకేమీ సంబంధంలేదు చెప్తున్నా' అని వొదిలేసాడు శీతారామయ్య. మెదలకుండా వూరుకున్న కొడుకులిద్దరివంకా పరకాయించి చూచాడు.

'అక్కడికీ నెలనెలా వందచొప్పున రెండు సంవత్సరాలు పంపాము మరి. ఈ పెళ్లిళ్లపేరు చెప్పి మా కంఠాలకేమో గుదిబండలు తగిలిస్తివి అని మదలకిస్తున్నాడు నళిని పెళ్లికిముందు విజయే కావాలని తను మొరాయించిన మొరాయింపు మరుపున పడిపోయిందప్పుడే మధ్యలోనే మాట తుంచేసి, 'మీరు డ్రాయరులాగి పద్దులపుస్తకం బైటికితీసి 'చూడండి' అని వాళ్లముందు

[illegible] శీతారామయ్య. తన 'జీపీ' ఫండూ, వాళ్లు నెలనెలా పంపిన పైకంలో మిగిలిందీ, వేయించిన పందిళ్లకిందా, ఏ 'అయిటం'కి ఎంతయిందో, ఆఖర్న ఎంత మిగిలిందో, ఎంత తగిలిందో సావకాశంగా చూచుకోమన్నాడు. ఇద్దరూ ఒకడి మీద ఒకడు వొరిగి మహాపరిశీలనగా చూచుకుంటున్నారు పద్దులు; తను తప్పుడు లెఖ్ఖలు వ్రాశాననో యేమో, వాళ్లచాత సంజాయిషీలు చెప్పించాలిసిందిపోయి చెయ్యని నేరాలకి తను సమాధానం చెప్పుకుంటున్న ఘట్టం విడ్డూరంగా ఉన్నదాయనకి. అక్కడికీ నెత్తురు సలసలమని కాగిపోతున్నా, ఆ 'లావా'ని శాయశక్తులా అణిచిపెడుతోనే వచ్చాడు కార్యసాధనకని. పద్దుచూచినట్టేచూచి ఈ 'సోఫాసెట్టు' కెంతయింది నాన్నా? అని 'క్రాస్' చేస్తున్నాడు నళిని. అక్కడే వుందిగా దాని ఖరీదు! ఆ 'క్రాసింగులో' అంతర్గతంగా ఒక నేరారోపణ ఉన్నదని గ్రహించలేకపోలేదు శీతారామయ్య. 'అప్పట్లో మీ ఇద్దరికీ పెద్ద పెద్ద సబంధాలు వొస్తున్న సందర్భంలో, కొంచెం హుందాగా ఉండాలనిపించి, 'టీ సెట్ల'నీ, తివాచీలనీ కొన్నమాట నిజమే. నేనేదో దర్జా పులుముకుందామని కాదు దరిమిలా అవన్నీ అమ్మిన జమలుగూడా చిత్తగించండి దొరలు. ఎటొచ్చీ సోఫాసెట్టు ఒకటుంది అదీ బేరానికి పెట్టాను' అని పేజీలు తిప్పి ఖచ్చితంగా వేలుపెట్టి చూపించాడు శీతారామయ్య 'దానిక్కాదు నాన్నా' అని నసుగుతూనే... 'రిక్షాలకీ రెండు రూపాయిలు చుట్టలకైదురూపాయిలు' అని ఏమీ ఎరగనట్టు పైకి చదువుతున్నాడు రామం 'సేల్స్‌టాక్స్ ఆఫీసరు' లెఖ్ఖలు 'ఆడిట్'చేస్తో 'అబ్జక్షన్లు' 'రికార్డు' చేస్తున్నట్టు 'ఫీల'య్యాడు శీతారామయ్య. ఆఖరికి పద్దులపుస్తకం మూసిపెడుతూనే, నళినికి ఒక 'జడ్జిమెంటి'చ్చాడు. 'తర్కంకోసం కాదు నాన్నా ఎట్లాగూ కొంత పొదుపుగానే పోవాలి మనం. మాట వరసకి, చుట్టలకని నెలకి అయిదు రూపాయిలవుతోందా మరి' అన్నాడు యధాలాపంగా.

'అయితే నన్ను చుట్టలు మానమంటావా?' చూస్తుండగానే మొహం ఉబ్బిపోయి, కళ్లు చింతనిప్పులల్లే ఎఱ్ఱజీరపడి బీభత్సంగా తయారైపోయాడు. 'నన్ను... నన్ను...' అని పూనకం వచ్చినట్టు ఊగిపోతూ ఆ చెంపా ఈ చెంపా ఛెళ్లు ఛెళ్లుమని వాయించాడు. 'అదేమిటి నాన్నా?' అని అదిరిపడి లేచాడు నళిని. 'మీ 'గేబర్డీన్ సూట్లూ', 'ఎంబాసిడర్ బూట్లూ' అటు ఢిల్లీకీ ఇటు బొంబాయికీ 'టూరింగు'లూ వీట్లమధ్య నా చుట్టకట్ట దుబారాకింద అవుపించిందట్రా రాస్కెల్' అంటూ ఆమట్న కత్తిదూసినట్టు, వంకీనున్న తోలు పటకా చఱ్ఱునలాగి నళినిని పట్టుకుని ఛక్‌ఛక్‌మని ఒకటే బాదేస్తున్నాడు; వొళ్లు తెలీకుండా వొణికిపోతున్నాడు; తూలిపడిబోతున్నాడు. నళినిమాత్రం నిటారుగా నిలబడి దెబ్బలుతింటూనే నవ్వుతున్నాడు నవ్వుతోనే దెబ్బలుతింటున్నాడు ఏమీ పట్టించుకోనట్టు. శీతారామయ్యని పట్టుకుని, 'పడిపోతావు నాన్నా! ఏమిటా వెఱ్ఱికోపం? కొడుదువుగానిలే కూచో,' అని హాలులో సోఫామీద కూచోబెట్టి అనునయిస్తున్నాడు ఎదురు. ఈ సందు చూచుకుని రామచంద్రం చల్లగా బైటకి ఉడాయించేశాడు ఇదంతా అన్నాయిమీద కొట్టుకు పోతోందిగదా అన్న దిలాసాలో. పార్వతమ్మ హడావుడిగా వొచ్చేసి అగ్గగ్గలాడిపోయింది. 'అయ్యో అయ్యో వొదలండి చిన్నసన్నాసిని ఛంపేస్తారాయే;' అని వాణీ, తనూ కలిసి విడదీసి, నళినిని వాటేసుకుని, వంటింట్లోకి లాకెళ్లి ముక్కాలిమీద కూచోబెట్టి తలుపేసింది. నళిని నంగనాచిలా మెదలకుండా ఊరుకున్నాడు, దెబ్బలెక్కడెక్కడ తగిలినయ్యో తరవాత సావకాశంగా చూచుకోవచ్చు

నని. ముక్కూ మొహమూ జేవురించిపోయినై. చేతులమీదా, మెడమీదా దద్దుర్లు తేలాయి. కాని చిత్రం! ఖంగారు పడకుండా స్థిమితంగా చిన్నగా నవ్వుతోనే వున్నాడు. శీతారామయ్య హాలులో అలంగం తిరుగుతున్నాడు. 'భూమీ పుట్రా అమ్మి, నా జి.పి. ఫండులోనించీ 'విత్‌డ్రా'చేసీ, ఎన్నిసార్లు రుణాలుతెచ్చి ఎన్నిసార్లు నా జీతంలో తీర్చాను; నానాగడ్డీ కరిచానా తవ్వితల కెత్తుతారని కొండంత ఆశలు పెట్టుకుని కుంగిపోతున్నానా ఒకచెంప! అవన్నీ అడుగున పడిపోయి, నాచుట్టలకట్ట పయికొచ్చిందట్రా స్కౌండ్రల్?' అని రంకెలు వేస్తున్నాడు; రగిలిపోతున్నాడు వంటింటనేనించీ నళిని ఏదో సమాధానం ఇవ్వబోతే, 'నోరుముయ్యి' అని గదమాయించింది పార్వతమ్మ. కుక్కినపేనల్లే, కిక్కురుమనకుండా ఊరుకున్నాడు.

అవతల వాటాలోనించీ ఇంటి యజమాని రఘురామయ్యగారూ, ఇంకా ఇరుగు పొరుగు పోగయ్యారు ఎక్కడెక్కడి వాళ్లూ జనం ఎక్కడనో ఇళ్లంటుకుంటున్నాయని బిలబిల లాడుతూ వచ్చేశారు. కొంతమందికి, 'ఈ శీతారామయ్య మొన్న మొన్నటిదాకా గుమాస్తా గిరీ వెలిగించిన వాడేను! ఇంట్లో సోఫాలూ, కిటికీలకి 'కర్టెన్లూ' మూడు పువ్వులూ ఆరుకాయలుగా వున్నదే ఈయన పని' అని కొంత కన్నెర్రగానే ఉంటున్నారు. వచ్చి ఫలానా సంగతి అని తెలుసుకుని, తండ్రీ కొడుకుల్ని విడదీసి, పైపెచ్చు, 'పెద్దలు తమరే అలా తొందరపడితే ఎలా?' అని చక్కా బోయారు. గుమ్మం దిగుతో కొంతమంది 'అయింది భగ్గా వెలుగూను అంతా తోడిపెట్టాడు కొడుకులికి... కొంప గుండమయింది... వాళ్ల సరేసరి. ఉద్యోగాలు దొరకబుచ్చుకొని, పెళ్లాల్ని పక్కల్లోకి తెచ్చుకుని, ఒకడక్కడా ఒకడిక్కడా టింగురంగా అని కొండెక్కి కూచున్నారు' అనుకున్నారు.

శీతారామయ్య సివాలు తొక్కుతోనే వున్నాడు.

'నా నెత్తురూ, నా ఆర్జనా, నా సర్వస్వమూ మంచి నీళ్లల్లే గడగడ త్రాగేసి, నా ఆస్తిపాస్తీ మేసేసి, కండబలిసి ఆంబోతులల్లే రంకెలు వేస్తున్నారా రాస్కెల్స్? నాకట్రా మీరు ధర్మపన్నాలు చెప్పేది? పొదుపును గురించి హితబోధలు చేసేది? నేను మట్టితిని మీ కన్నం తినిపించానే! నేను గంజితాగి మీకు అమృతం పట్టించానే! పాలుబోసి పనిగట్టుకుని పాముచేత కాటువేయించు కున్నట్టయిందే నా రాత! ఇంత అక్రమానికి ఒడిగడతారట్రా? సిల్కులూ టెరిలిన్లూ, టెర్రీకాటన్లు తప్ప మామూలు చొక్కాలూ 'పాంట్లూ' తొడిగారట్రా మీరు? 'పిక్‌నిక్కులా?' 'డిన్నర్లా? 'ఎగ్జిబిషన్లా'? తీర్థయాత్రలా మీ చావులా? మీ శ్రాద్ధాలా? కొవ్వుబలిసి పెళ్లాం కొంగులు పట్టుకుని సినీమాలా? బీచ్‌షికార్లా?... ఇవన్నీ మీరు సంపాయించుకున్న ఉద్యోగాలే అనుకుంటున్నారేమిట్రా? 'డొనేషన్లు' కట్టి అడ్డమైన వారికి 'సిఫార్సులు' మోసుకొచ్చి మీ ఎదాన్ని పెడితే కులుకుతో అందలమెక్కి, పగ్గాలు చేత్తో పుచ్చుకుని పరవళ్లు తొక్కుతున్నారా? ఒరేయ్ పెద్దింజనీరూ ఆడంగి వెధవా! వంటిటో పెళ్లాం విడిచిన నైలాన్‌చీర మడత బెడుతున్నావేమిట్రా? బైటికిరా నీ రక్తం కళ్ల జూస్తాను,' అని బారలు చూపి, పెద్ద పెద్ద అంగలువేస్తో హాలు కటూ ఇటూ సవారీచేస్తున్నాడు సివాలు తొక్కుతున్నాడు సవాలు చేస్తున్నాడు.

'ఇదుగో ఇటు చూడండి.'

వెనక్కి తిరిగి చూచాడు శీతారామయ్య.

'ఒకటే గుర్తుంచుకోండి అల్లరిపడితే మనకే నష్టం బ్రతుకు బజార్ని పడెయ్యకండి పిల్లల పెళ్లిళ్లున్నాయి.' కుంకుమబొట్టు చెరగకుండా కొంగుతో మొహం తుడుచుకొంటూ గుమ్మంలో నిలబడింది పార్వతమ్మ.

'నిజమేనే నీ మాట విన్నానుగాదే! పెళ్లి ఈడుకొచ్చిన ఆడపిల్లలు నట్టింటఉండగా మొగ రాజులకేమి తొందరొచ్చిందీ అని హెచ్చరికలివ్వనే ఇచ్చావు నువ్వు. వంటింట్లో పొగచూరిపొయ్యే నీకున్నపాటి ప్రపంచజ్ఞానం నాకు లేకపోయిందే. ఈ రాక్షసుల్నినమ్మి నా కూతుళ్ల భవిష్యత్తు బుగ్గిపాలు చేశానే వాళ్ల బ్రతుకులు ఈ కసాయి ముండాకొడుకుల చేతిలోపెట్టేశాను' అని హాలుకి మధ్య, గొంతు కూర్చుని వంకరలు తిరిగిపొయ్యాడు శీతారామయ్య. 'వీళ్ళ పెళ్లిళ్లకని ఎవరిని చందా ఎత్తను? నెలకి అయిదారువందల జీతాలు తెచ్చుకుంటున్న కుమారరత్నాలొక చెంప అహోరిస్తుంటే, నేనేమీ ఇవ్వలేనంటే నమ్మేదెవడు?' అని అచ్చు ఒక ఆడదానిలా శోకాలు పెట్టాడు శీతారామయ్య.

ఆ వేళ మరి చుట్ట వెలిగించలేదు శీతారామయ్య. అటు ధ్యాసపోయినప్పుడల్లా ఆ నళిని ఎత్తిన చుట్టలకట్ట కెలకవేస్తోంది లోపల.

నాలుగు మెతుకులు కతికి, నిస్త్రాణగావుండి నిద్రపొయ్యాడు శీతారామయ్య. తెల్లవారుతోనే లేచి "వాళ్లేరని" అడిగాడు. కాఫీనీళ్లలో ఇంకా కసిన్ని నీళ్లు కలుపుతో 'వెళ్లారు' అంది పార్వతమ్మ ముక్తసరిగా. 'ఎప్పుడు?' అన్నాడు శీతారామయ్య నోరు తెరిచేసి. 'రాత్రే' అన్నది. 'అవురా!' అని స్తంభించిపొయ్యాడు శీతారామయ్య.

*　　　　*　　　　*

శీతారామయ్య నీరసించిపోతున్నాడు. డాక్టరు దగ్గరికి వెళ్లండి అని పోరుపెట్టింది పార్వతమ్మ వినడు. రోగం నీకా నాకా?' అని ఎదురు తిరిగాడు. పాతికేళ్లు చుట్ట అలవాటు పూర్తిగా కట్టిపెట్టాడు. మందకొడిగా ఉంటూంట అందుకా అనుకున్నారు ఇంటెల్లపాదీ.

అటూ ఇటూ ఉత్తరాలు నడవడం లేదు. ఉత్తరం రాయలేకపోతే నష్టపడేదెవరో తెలియదు గనకనా వాళ్లకి?

రాధమ్మచేత ఉత్తరం రాయించింది పార్వతమ్మ. ముక్కాలి పీటమీద కూచుని తల ఓరగావంచి రాధ వ్రాశింది. 'ఆఖర్ని 'అమ్మ ఘోషపెడుతోంది' అని వ్రాయి తెలిశిందా?' అన్నది పార్వతమ్మ. వ్రాయించింది, వాయిల్ చీరకి కందికాయికుట్టు మూడోసారి కుట్టుకుంటుండగా చూచిన్నీ చలించని కొడుకులికి!

ఆ వుత్తరానికీ జవాబు రాలేదు.

వ్యవహారం కటికముడి పడేలా వున్నదే అని విచారించాడు శీతారామయ్య. ముళ్లమీదపడిన మల్లుపంచెని నిదానంగా తొలిగించుకోవడంపోయి, లాగిలాగి చీలికలూ పేలికలూచేసి వదలి పెట్టాడా తను? వదలిపెట్టాడా తను? ఏమో వెనక్కి తిరిగి చూచుకుంటే తనుచేసినవన్నీ తప్పులే

అనిపిస్తోంది. తను గుమాస్తా గిరీలో ప్రవేశించడమూ పిల్లలు ఛస్తే గుమాస్తాలు కాగూడదని తీర్మానించుకోవడమూ వాళ్లని పెద్దచదువులు చదివించి పెద్దవుద్యోగాలు సంపాయించి పెట్టడమూ, వాళ్లకి పెళ్లిళ్లు చెయ్యడమూ ఒకటేమిటి ఆ ఘడియదాకా నడిచిన తంతంతా తప్పు. తప్పు... ఒకటే తప్పుల తడక! శిక్ష అనుభవిస్తున్నాడు కాని ఈ ఆడపిల్లలు... అభమూ శుభమూ ఎరుగని వాళ్ళు కాబట్టి ఏ సమంధాలు వొచ్చినా నీ ఇష్టం నాన్నా అంటున్నారు. తనకి భారం తగ్గిద్దామని... అయ్యో, నోరులేని ఈ పసివాళ్లని నిష్కారణంగా అన్యాయం చేశానే అనిపించింది శీతారామయ్యకి.

* * *

ఒకనాడు భోజనానికి వంటింటికేసి వెడుతుంటే రెండు కొత్తచీరలు మడతబెడుతోంది పార్వతమ్మ. 'ఎక్కడివే'? అని అడిగాడు శీతారామయ్య. నేతిగిన్నె కుంపటీమీద పెడుతూ, 'నళినిని తెమ్మన్నా' అన్నది. 'ఏమిటేమిటి? అయితే అడుకున్నావన్నమాట? దేహీ అన్నందుకు ఫలించింది మొత్తంమీ్మద. ఏమేవ్ రాధీ! చిన్నన్నాయిని నువ్వూ అడుక్కోకపోయినావటే? నాలుగువోణీలు తీసుకొచ్చి పడేశేవాడు' అని ఎద్దేవా చేస్తున్నాడు శీతారామయ్య.

'అబ్బ పోనిస్తురూ నా పేగులో పేగు వాణ్ణి అడిగినా అడుక్కున్నా నామర్దాలేదు నాకు...'

'పేగులో పేగు! ఆ పేగులే మిగిల్చారులే నీకూ నాకూ. ఒసేవ్, నీకు బుద్ధీ శరమూ లేదటే? సిగ్గూలజ్జాలేవూ? ఏ మొహం పెట్టుకుని అడిగావే వాణ్ణి? అదుగో చూడు ఆ శనివారప్పేట మలుపులో నాలుగు రోడ్లమొగని కూచుంటివా, సాయంత్రానికల్లా పదిరూపాయిలు రాలతాయే!' అని నవ్వుతోనే అంటించాడు శీతారామయ్య.

వాణీ రాధారాణీ హాలులోకి తప్పుకున్నారు, ఈ తుపాను తమమీత పడినా పడవచ్చుని.

* * *

విజయరాఘవంగారు గుంటూరు మారారు ఈ మధ్య. ఇట్లాకాదని శీతారామయ్య వియ్యంకుడి దగ్గరికి వెళ్లాడు. కాళ్లు కడుక్కుందుకు నీళ్లివ్వడంగానీ, కుశల ప్రశ్నలు వెయ్యడం గాని చెయ్యలేదాయన. అదేమిటి? ఆయన అల్లుణ్ణికాదుగా తను కొడతా. తనే కూచున్నాడు. తప్పుతుంది గనకనా? ఆయన ఉపోద్ఘాతం లేకుండా 'ఏమండీ బావగారూ వాళ్లది పడుచురక్తం మనవేమో కాగిచల్లారిన పాలాయెనూ. పెద్దలయ్యుండీ చెట్టంత కొడుకుమీద చేయిజేసుకుంటారా.

ఆనాడు తనని ఆవహించిన భూతమేదో మళ్లీ మేలుకున్నట్టయ్యింది లోపల. అనువుగాని చోటాయెను తమాయించుకున్నాడు. ఎంతో ఓర్పుగా వివరించాడు. తర్జనభర్జన జరిగింది కాసేపు. కొసకి 'జరిగిందేదో జరిగిపోయిందిలేండి' అనేసుకున్నారిద్దరూ. ఇష్టాగోష్టిలో ఆడపిల్లల పెళ్లిళ్లమాట ఎత్తాడు శీతారామయ్య.

'ఎక్కడిదక్కడ బిగించుకుని కూచుంటే ఎట్లా నేను గట్టెక్కేనూ?' అని నిగ్గదీశాడు విజయ రాఘవంగారు గొప్ప వ్యవహర్త. కళ్లజోడు తీసి ఎడవచేత్తో పట్టుకుని, కుడిచేతి చిటికెనవేలితో సిగరెట్టు నుసి విదిపి, కొసని వెలుగుతున్న ఎరుపు వంక తీక్షణంగా చూస్తో మందహాసం

చేశాడాయన 'చూడండి బావగారూ నాకు నలుగురాడపిల్లలు నేను లక్షాధికారినే అనుకోండి నలుగురికి నాలుగు పదిహేను అరవైవేలు ధారపోసి బ్రతికి బైటపడే సరికి నా ముగ్గురు కొడుకులికీ ఏమి మిగులుతుందో చెప్పండి. నేను ముట్టజెప్పిన పదిహేనువేలూ మీ పెళ్లిళ్లకని వెచ్చిస్తే నాబిడ్డ ఏమికాను? మీ ఆస్తి చూచి ఇచ్చానా నేను? చదువు చూచి ఇచ్చాను. అమ్మాయికీ, దానినిబట్టి అల్లుడికి ఆధారంగా వుంటుందని కొంత ఆస్తి ఆడపిల్లలపేరు వ్రాశాం... అది తేతెమ్మనమంటే ఎట్లా?'

'అదుగో పిల్లల కాస్తి అంటారేమిటండీ?' అని తర్జుమా చేసాడు శీతారామయ్య.

'కట్నమని ఎవరు చెప్పారండీ మీకు?, మాచేతి మీదుగా మీకుముట్టే మొత్తాలవి. నా కూతురూ నా అల్లుడూ అనుభవించాలది. నా అల్లుడేగాని మీ కొడుకు కాదాయేం?'

ఈ నాటకం వెనక ఈ మామయ్య మంత్రాంగం పూర్తిగా వున్నట్టుంది.

ఆయనన్నదీ సబవుగానే వుంది శీతారామయ్యకి తన కూతుర్ని ఆస్తిలేని అల్లుడికి దయాధర్మ భిక్ష్యం కింద ఇచ్చినందుకు కొంత ఆధారం చూయించారు ఇద్దరికీనీ. తను పడిన శ్రమంతా ఈయనగారి కుమార్తెకి మాంచి అల్లుణ్ణి పెద్దపెద్ద చదువులు కొవ్వుపట్టేలా తయారు తినిపించి సిద్ధం చేసేందుకన్నమాట! బావుంది సందర్భవశాత్తూ ఆ ఖాతా పద్దులూ అతని కళ్లబడినై అట్లాగే వున్నాయి అవి. కోడిగుడ్లు పెట్టినట్టు ఫాయిదాలు పెంచుకొంటూ ఏమీ వాడుకోలేదు వాళ్లు.

*　　*　　*

శీతారామయ్య ఏలూరు వచ్చేసి 'ప్లీడరు' దగ్గరికివెళ్లి ఉన్న పరిస్థితి వివరించాడు. 'ప్లీడరు'గారు అవీ ఇవీ తిరగేసి, చప్పరించి 'ఏమీ లాభం లేదు' 'లా' బుక్కులన్నీ మూసిపెట్టేశాడు. 'ఆ డబ్బంతా ఆడపిల్లలకి తండ్రి ఆస్తికింద లెఖ్ఖలలో వుంది. మరి అది స్త్రీ ధనం. కోడళ్లకే హక్కుంది ఆ పైకమ్మీద. అది నీకు కట్నంకింద దఖలుపడలేదు. 'అది కట్నమేను' అని నువ్వు తర్జుమా చేశావంటే జైలుకుపోతావు జాగర్త. కట్నాల నిషేధమిప్పుడు, నీకు తెలీదేమో గోల' అని హెచ్చరించాడు.

కండవా చంకనెట్టుకుని తలకాయి వంచుకుని ఇంటికి తిరిగి వచ్చాడు శీతారామయ్య.

సరే ఎక్కడైనా కొంత బదులుతెచ్చి పిల్లలకి పెళ్లిళ్లు చెయ్యాలని సంకల్పించుకున్నాడు శీతారామయ్య. ఆ మధ్య ఏదో మూడువేలు కావాలి', అని అడిగితే, 'మూడు కాదు నాలుగు తీసుకో నీ కివ్వడానికేమయ్యా బంగారు పిచ్చుకవు' అని ఆకాశానికెత్తిన కరణం సుబ్బారాయుడు, మళ్లీ ఆప్రస్తావన తెచ్చేసరికి, 'అరె ఇంకా కూచుందీ? నిన్న నడిగితే ఇచ్చేవాణ్ణేస్మీ' అని నాలిక కరుచుకున్నాడు. ఇద్దరు ముగ్గుర్ని కదిపి చూచాడు. తొంట చెయ్యి చూపారు. ఆనాడు తను అనాలోచితంగా పెట్టుకున్న గలాటాలో కొడుకులకీ తనకీ పడడంలేదనీ, వాళ్లని దృష్టిలో పెట్టుకుని ఈయనకేదో ఇవ్వడం ప్రమాదమనీ అప్పుడే 'పబ్లిగ్గా' తెలిసిపోయింది. ఇహనువిక్కడ తన పరపతి చచ్చింది. ఇదివరకే ఈ వూహ తట్టివుంటే బదులు తీసుకొచ్చి కొడుకుల్ని తీర్చమనేవాడు.

రోగం కుదిరేది దానితో. తరవాత వాళ్ల వాళ్లూ గంగలో కలవనీ.

*　　　*　　　*

సమంధాల కోసం మళ్లీ తడిమన్ను పొడిమ వెళ్లినా మీ అబ్బాయి లేమిచేస్తున్నారూ అన్న ప్రశ్న వస్తోంది చెప్పాడు. చెప్పక తప్పుతుందా? ఆ చెప్పినప్పుడు ఒకానొక గర్వరేఖ మెరిసింది కూడా తన కళ్లల్లో కాని కట్నమెంతా అన్న ప్రశ్నఎదురుకోగానే పలాయనం చిత్తగించక తప్పడంలేదు. వచ్చిన వాళ్లు పిల్లని చూచి, పనిలోపనిగా చుట్టుపక్కల ఏదో కొంత వాకబుచేసుకుని, 'ఈయనకీ కొడుకులికీ పడటంలేదట. ఏమి విదుపుతాడూ ఇహ?' అని తిరుగుముఖం పడుతున్నారు. వాళ్లు తీసుకొచ్చిన బత్తాయికాయిలూ, పటికబెల్లం పొట్లాలూ ఇంట్లో వీళ్లు ఊదేస్తున్నారు. తను పెట్టిన కాఫీలూ, కలర్లూ వాళ్లు ఊదేస్తున్నారు పర్యవసానం తన 'పెన్షన్'లో ఒక పెద్దమొగ్గ్రి ప్రతినెలా!

క్రితం రోజున ధవళేశ్వరంనించీ ఎవరో వచ్చి చూచిపొయ్యారు. రాధనయితే చేసుకుంటా రట! ఇదో కొత్త ఆపత్తు వొచ్చిపడింది. అరుగుమీద కూచుని, 'రాధీ ఇట్రా' అని పిలిచాడు. జడ అల్లుకొంటూ వచ్చింది. ఈ మధ్య పిలవగానే పల్లక్కపోతే పెంకులెగిరేలా కేకలేస్తున్నాడు శీతారామయ్య. 'ఇటు చూడమ్మా వాణీ పెళ్లిచూపులు కెవరైనావస్తే కొంచెం నీ అలంకారం తగ్గించు తెలిశిందా? దాన్ని వొదిలి నీకూడా పడుతున్నారు అప్రాచ్యులు. ఆ 'పవుడరు' అంత వొత్తుగా మెత్తనఖ్ఖర్లేదులే, జడలో రిబ్బను అంత నాజుగ్గా మిసమిస లాడనఖ్ఖర్లేదు కొంచెం షోకులు తగ్గించు లేకపోతే ఏ వంటింట్లోనో కాసేపు ఆహొూరించు.'

'అట్లాగే నాన్నా' అని మెల్లిగా వెళ్లిపోయింది రాధ.

'దొరసానివేషాలూ నువ్వూనూ! మహా అందంగా వున్నావని మిడిసిపాటుగా వుందిలే నీ అందం అందలమెక్కినట్టేవుంది! కొంచెం నిదానంగా నడువు అదేమి నడక? సివంగి నడక! అమ్మో పెళ్లిపెడాకులూ లేవుగాని, అయితేనా, పైనబడితే వానలుండవు కిందబెడితే పంటలుండవు పట్టపగ్గాలుండేనా?' అని సణుగుతోనే వున్నాడు వెనకాల. 'ఎందుకట్లా చిన్నసన్నాసుల్ని వేపుకు తింటారూ?' అని ముదిలకించింది పార్వతమ్మ. తన గదిలోకి దూరింది చక్కా.

ఒక విచిత్ర ధోరణి శీతారామయ్యకి.

వాణీ రాధారాణీ ఎవళ్లకివాళ్లు శీతారామయ్యకి కనబడకుండా దాక్కొంటున్నారు. కొండగుహలో ఆకలిగొన్న సింహంలా రుసరుసలాడుతో కూచుంటున్నాడు ముందుగదిలో శీతారామయ్య.

*　　　*　　　*

ఎక్కడినుంచో హడావుడిగా వచ్చేసి,... 'ఏమ్రోయ్ ఎక్కడ చచ్చారే లోపల' ఒక్క పొలికేక పెట్టాడు. 'ఏం కావాలీ?' అని ఎంగిలి చేత్తో హడావుడిగా వచ్చింది పార్వతమ్మ 'నీ శ్రాద్ధం' అని చక్కాబోయాడు గదిలోకి. 'ఏమిటీ మనిషీ?' అనుకుంది పార్వతమ్మ.

*　　　*　　　*

వాణీ ఏదో పుస్తకం చదువుకుంటోంది. 'ఏమిటీ ఆ పుస్తకం? డిటెక్టివ్ నవలా?' నాన్న గదమాయింపుకి గభాల్న లేచింది వాణీ. 'అట్లా తెల్లమొహం వేస్తావేమిటే నీ మొహంమండా... చదివింది చాలులే తల్లీ... నవలలు చదువుతోంది!... అదిగో ఆ కిటికీలోంచి పరకాయించి చూస్తున్నావేమిటీ? పక్కింటి కిటికీలో ఎవడైనా వున్నాడా యేం? ఇహనదే తరవాయి. వంటింట్లోకి తగలడే తగలడు. పెళ్లయ్యేదాకా మాట దక్కించండి. ఆ తరవాత గంగలో కలవండి' రివ్వున తనగదిలోకి దూరాడు శీతారామయ్య 'వెధవ మొహాలంటూను వెధవ మొహాలు! ఇట్లాంటి దిష్టిపిడతకే పెళ్లిళ్లయ్యేది. టాయిలెట్టు అరగంటా? రోజూ రోజుకీ మొహాన్ని తిలకంమాత్రం పెద్దదవుతోంది!...' అని గొణుక్కొంటూనే వున్నాడు.

పిల్లలిద్దరూ పెద్దవాళ్లవుతున్నారు. మీద కొచ్చిపడుతున్న అందాన్నీ వయస్సునీ ఎక్కడ దాచుకోగలరూ? సాదా పరికిణీ వోణీ అగుపిస్తే, ఏమిటా అవతారం వెధవముండా వేషాలూ నువ్వూను! అది మొగుడు చచ్చిం తరవాత ఇప్పుడుకాదు తెలిసిందా?' అని రొక్కిస్తున్నాడు. మొహం కాస్త సబ్బుతో తోముకుని తలలో ఏమయినా తురుముకుంటే చాలు, 'ఎక్కడికి వేంచేస్తున్నా రంగసానులు మెరకవీధికా?' అని శూలాలు పొడుస్తున్నాడు.

ఘడీ ఘడీకీ తమమీద చేస్తున్న ఈ దండియాత్రలో అక్క చెల్లెల్లిద్దరూ జడివానలో తడిసిన కాకులల్లే ముడుచుకుపోయి ఏ వంటింటి మూలనో నక్కుతున్నారు తల్లి పంచని.

ఎంత మారిపోయాడు నాన్న! ఎంతో అస్తారుబతంగా చూచుకున్న నాన్న! కాలు కిందపెట్టనిచ్చేవాడా? సిగపువ్వు వాడనిచ్చేవాడా? ఒక్క తుమ్ముతుమ్మితే చాలు, కాస్త తలనొచ్చితే చాలు అడ్డమైన మందులూ పట్టుకొచ్చేవాడు రొంప 'బ్రాంఖాయిటిస్' లోకి దింపుతుందనేవాడు. జ్వరం రెండు రోజులు పొడిగిస్తే చాలు 'టైఫాయిడ్' కాదుగదా అని గాబరాపడిపోయేవాడు. నీళ్లల్లో కాస్త తడిస్తేచాలు జలుబు చేస్తుందనేవాడు. రాత్రి పదిదాటి చదువుకుంటే నిద్దరచాలక వేడిచేస్తుందనేవాడు. అట్లాటి నాన్న ఇప్పుడు దుర్నిరీక్ష్యంగా వున్నాడు... ఆ కోపం! అది కోపం కాదు ఆ కోపానికి గురి అవుతున్నందుకు కాదు వాళ్లుబాధపడుతుంటా. ఆ కోపానికి వెనక ఓడిపోయి, రూపం మార్చుకొని, మారువేషం వేసుకొని కఠోరంగా బైటపడుతున్న మమత్వం! ఆ మమకారానికి ఈ కోపం ప్రతిరూపం. వాత్సల్యప్రేమ అన్నది సహజంగా, ధారాళంగా, ఆరోగ్యంగా బైటపడినప్పుడే తేనెసొనలా వుటుందికాని సందు దొరకక గిలగిల కొట్టుకునే ప్రేమ, గుండెలు దొలిచే ప్రేమ, కోపంకిందా, రోషంకిందా, ద్వేషంకిందా, వెటకారంకిందా, తిట్లకిందా, చివాట్లకిందా విషం కక్కుతూ బైటపడుతుంది. క్షణక్షణమూ.

ఇంటిసామాన్లన్నీ ఒకదాని తరవాత వొకటి తాకట్టులోకి నడిచివెళ్లి వాకట్టయి ఊరుకున్నాయి. శీతారామయ్య చూస్తూ ఊరుకున్నాడు. ఇంటి అద్దె బకాయిపడింది. ఏదో వొకనాడు గప్‌చిప్పుగా ఇంటికి తాళంపెట్టి ఏదో ఊరు, ఏపల్లెటూరో ఉడాయిస్తేసరి! ఎవడు చూడొచ్చాడు? పార్వతమ్మకి సూచనగా అందించాడొకనాడు. 'అమ్మ' అని నోరుపక్షివి నాయంట న్యాయం!' విదిలించి చక్కా పోయాడు శీతారామయ్య.

* * *

ఒకనాడు దొంగచాటుగా వంటింట్లోకి తొంగి చూచాడు శీతారామయ్య. కళ్లు మూసుకుని గౌరీదేవి పటంముందు జపంలో వుంది పార్వతమ్మ. 'నూనె తగలేస్తోంది దీన్తుంపతెగా' అనుకున్నాడు. అగరొత్తులొకటా? ఈవిడకి జపాలూ తపాలూ ఎక్కువయి పోతున్నట్టున్నాయి. దీని నాడి ఇంతవరకూ పట్టుబడలేదు తనకు. ఈ రోగం సెలవేయక క్రితమే జాగర్తపడాలి. కొక్కిరాయి చేష్టలు మానిపించాలి లేకపోతే, అరిటిపళ్లనీ, కొబ్బరికాయలనీ, హారతికర్పూరమనీ తేతెమ్మంటుంది. ఆపద మొక్కులేమైనా మొక్కుతోందేమో, లోలోపల కొంపతీసి. ఆనక తీర్చమంటుంది... శీతారామయ్య గుండె తీవ్రంగా కొట్టుకుంది. కాని అలికిడయితే ఆవిడ జపమెక్కడ భంగమవుతుందోనని గుండె పీకుతోనే వుంది ఒక చెంప. పిల్లిలా అడుగులు వేసుకొంటూ హాలులోకి వెళ్లిపోయాడు.

* * *

ఒకనాటి మధ్యాహ్నం, శీతారామయ్యా పార్వతమ్మ ఒక చిన్న చిట్కా ఆలోచించారు. అందరూ కట్టగట్టుకునివెళ్లి భిలాయ్‌లో ఆ పెద్దాడిమీదపడితే సరీ తిండిపెట్టను పొమ్మంటాడా? పెళ్లిళ్లమాట తరవాత చూడవచ్చును. బాగుందంటే బాగుందనుకున్నారు. ఇన్నాళ్లూ ఇంత చిన్న ప్రక్రియ ఊహకి తట్టలేదేమా అనిపించింది. కాని పార్వతమ్మ ఒక చిన్న 'బ్రేక్' వేశింది. భలానానాడు భలాని 'ట్రెయినుకి' వస్తున్నాము అని ముందస్తిగా వ్రాయమంది. ఈ మధ్య పార్వతమ్మ మాటమీద శీతారామయ్యకి కొంత గురి కుదిరింది. ఉత్తరం వ్రాశాడు. చిత్రం! తిరుగు టపాలో జవాబు వచ్చింది. అంతావస్తే పెద్ద ఇల్లొకటి తీసుకోవాలిశుంటుందనీ, ఇంటికోసం గాలిస్తున్నాననీ, ఇల్లు దొరకగానే ఉత్తరం వ్రాస్తాననీ. ఆ పెద్దయిల్లు ఛస్తే దొరకదు! దొరకలేదు కూడా!! ఉత్తరాలమీద ఉత్తరాలయితే వ్రాశారు. కూచుండీ... అసలే తమ అమ్మా నాన్న వీళ్లు కాదు అని బుకాయిస్తే? ఇరుగూ పొరుగూ నమ్మినా నమ్మవచ్చు. నమ్మరూ? అబద్ధం ఎంత పెద్దదయితే అంత సులభంగా నమ్మించవచ్చును. 'మీది మరీ విడ్డూరమండీ అందాకా వెడుతుందా?' అని అన్నదేగాని పార్వతమ్మకీ సంకోచంగానే వుంది లోపల. ఈ మధ్య శీతారామయ్య ఏదైనా వెయ్యి అపాయాలు ముట్టడిస్తున్నాయి. మళ్లీ ఒక్కొక్క అపాయానికీ ఉపాయాలల్లుకు పోతున్నాడు. మెదడు మహచురుగ్గా పనిచేస్తోంది. ఎవరో చెబితే విన్నాడు మెదడు ఆగిపోయేముందు అతితీవ్రంగా ఆలోచిస్తుందట.

చుట్టూతా తనకి పిచ్చెక్కిందని పుకార్లు రేగుతున్నాయి. ఒకవేళ తనకి పిచ్చేమో గోల. ఆలోచనా పాలోచనా అంతా శుభ్రంగానే వుంది మరి లోపల పిచ్చివాడికి పిచ్చెక్కుతున్నట్టు తెలుస్తుందా అసలు? ఏమో మొదట్లో మెదడు ఒకవైపునించీ కుళ్లిపోతుంటే ఇంకోవైపున అటుకేసి కుళ్లుపడుతున్నట్టు తెలివిడి పనిచేస్తుందేమో. క్రమేణా మెదడంతా కుళ్లిపోయి, పిచ్చిముదిరి... శీతారామయ్యకి బుర్ర వేడెక్కిపోయింది.

* * *

ముంగిట్లో బాదంచెట్టు ఆకులు రాలుతున్నాయి. కిందపడిన ఆకుల్ని మేకలు పరపర నములుతున్నాయి.

శీతారామయ్య పచారికొట్లో ఖాతా పుస్తకమ్మీద బ్రాటోవర్ల దగ్గర ఘర్షణపడి ఇంటికి వస్తున్నాడు. కనుచీకటిగా వుంది. రాధారాణీ ఎక్కడికో వెళ్లి తిరిగివస్తూ కనిపించింది. 'ఎక్కడికి వెళ్లావు?' అదుర్దాగా అడిగాడు వెనకాలనించీ. బిక్కచచ్చిపోయింది రాధ. ఏదో జరుగుతున్నదని లీలగా అనుమానం సోకింది శీతారామయ్యకి. అతనికి మానవత్వంమీదా మంచితనంమీదా నమ్మకం క్షీణించిపోయింది. 'పద ఇంటికి' అని నడిపిస్తూ, 'ఏమిటి కథ?' అని లాలనగా అడిగాడు. 'ఎంప్లాయిమెంట్ ఎక్సేంజ్ ఆఫీసు' కెళ్లి వస్తున్నాను నాన్నా. వాణీకీ నాకూ 'పోస్టింగులు' పడినై.'

'ఎక్కడా?'

జిల్లాపోలీసు ఆఫీసులో... అన్నది నేరం చేస్తుండగా దొంగ దొరికిపోయినట్టు. ఇంటో అడుగుపెడుతోనే, 'ఏమండోయ్ పార్వతమ్మగారూ తమ పుత్రికామణులు ఉద్యోగాలు సంపాదించుకొన్నారేవ్ బలేబలే... అవున్లే కొమాళ్లు నాకు మల్లే గుమాస్తాలై ఎక్కడ నలిగిపోతారో అని వాళ్లని ఆ గాడిలోనించీ తప్పించా. వాళ్లని వొదిలి అమ్మాయిల్ని వరించిందిలే గుమాస్తాగిరీ. ఆనవాయితీ తప్పిస్తే ఎలా? అవతల వీధిని శ్రీరామచంద్రమూర్తిగారి యింట్లో వంటమనిషి కావాలిట... 'అప్లికేషనివ్వు దాఖలుచేస్తా. ఇదంతా నన్ను ఏ షావుకారు గుమాస్తాగానో అఘోరించమని పాఠమా యేం?' అన్నాడు.

అన్నంగిన్నె పొయ్యిమీదనించీ దింపి విసవిస నడిచివచ్చింది పార్వతమ్మ. 'చూడండి మీరు వేళాకోళంగా అంటున్నారుగాని, ఇప్పుడు మీరన్న పనులన్నీ అక్షరాలా జరిగితే ఆ దుర్మార్గుల చేతిలో పడకుండా దివ్యచకోరంగా గడిచిపోతుంది మనకి.' తెల్లమొహం రాగిరంగు పడిపోయింది. ఈవిడ కెట్లాగూ చొరవ ఎక్కువయిందీ మధ్య. ఇష్టమే గావును దీనికీ నోరొస్తోంది మెల్లిగా అనుకున్నాడు శీతారామయ్య.

ఆ బులపాటమూ అయింది. షావుకారు మల్లికార్జునంగారి కొట్లో చిఠాఅవర్జాలు వ్రాసాడు కొన్నాళ్లు శీతారామయ్య. ఒక వారం రోజులదాకా 'పంతులుగారూ' అని సంబోధించాడు షావుకారు. తరవాత 'పంతులూ' అని పిలిచాడు. 'ఏమండి'తో మొదలై, 'ఏమోయ్'దాకా దిగజారింది కొసకి. సరిపెట్టుకున్నాడు. ఒకనాడు బజారుకెళ్లి కూరగాయలు పట్రమ్మన్నాడు. చేతికిచ్చిన వలసంచి మొహాన్ని కొట్టి చక్కావచ్చాడు. క్రిమినల్ కేసు పెట్టడుకదా? ఇంకా నయం. నౌఖర్ననుకుంటున్నాడు గామాలు!

* * *

మర్నాటినించీ వాణీ, రాధారాణీ ఉద్యోగాలు చూచుకున్నారు. దొడ్డిదారినవెళ్లి, నాన్నకి కనపడకుండా మెలకువగా ఇంట్లోకి జొరబడుతున్నారు. దొంగకి తేలుకుట్టి నవతుగా శీతారామయ్య తెలిసీ తెలీనట్టే నోరుమెదపకుండా ఉన్నాడు. అయిందానికీ కానిదానికీ నోరుచేసుకుని వాళ్లని నానాహింసలుపెట్టి, మాటలతో కుళ్లబొడుస్తూ 'ఈ పని ఎందుకు చెయ్యారూ వీళ్లు?' అనేమో తన అంతరాత్మే తనకి ద్రోహం చేస్తోంది. ఈ మధ్య తనలోపల ఒక మనిషీ, బైట మరోమనిషి

పని చేస్తోన్నట్టు అనుమానం సోకింది శీతారామయ్యకి.

*　　　　*　　　　*

మెల్లిమెల్లిగా చుట్టూ పేరుకున్న అప్పులు తీర్చేశాడు శీతారామయ్య. కొంపలో కూరా, నారా పాలూ పంచదారా పుష్కలంగా అమురుతున్నాయి. మళ్లీ సంసారం పచ్చపచ్చగా రంగులు మార్చుకుంటోంది.

ఒకనాడు రాధారాణీ నాన్న దగ్గరికి పరిగెత్తుకొచ్చింది. చేతులూ రెండూ వెనక్కి పెట్టుకుని 'నాన్నా, నీకో తాయిలం తెచ్చా' అంది. అట్లా అల్లారు ముద్దుగా తన బిడ్డలు నిర్భయంగా తన దగ్గరకెప్పుడు వస్తారా అని ఎదురు చూచి చూచి కళ్లుకాయలు కాచిపోయాయి శీతారామయ్యకి. ఏ కళనున్నాడో తల కుర్చీ వెనకాలమోపి, 'పెట్టు' అని నోరు పెరిచాడు చిన్నపిల్లాడికి మల్లే. రాధగోముగా కుర్చీచేతులమీద కూచుని, నాలుగు పొగాకుకాడలు టేబిలుమీద వుంచి, 'చుట్ట కాల్చవు నాన్నా?' అని గునిశింది. ఏదో బాంబు పేలినట్టయి భళ్లున దుఖం వచ్చింది శీతా రామయ్యకి. ఆయన జుత్తులోకి వేళ్లు పోనిచ్చి, 'ఆడపిల్లలకి మాత్రం అమ్మా నాన్నాని పోషించుకునే హక్కులేదా యేమిటి నాన్నా' అని అనునయించింది రాధ.

డగ్గుత్తికతో కళ్లు వొత్తుకున్నాడు శీతారామయ్య.

*　　　　*　　　　*

వాణి కొంచెం మెతక. నల్లనివన్నీ నీళ్లు తెల్లనివన్నీ పాలూ అనుకుంటుంది. ఆఫీసులో పక్కసీట్లోవున్న రహమాన్ కలగజేసుకుని ఏ కాయితం ఎట్లా 'డిస్పోజాఫ్' చెయ్యాల్సో ఓపికగా చెప్పాడు పాపం మంచివాడు అనుకుంది. 'మీ వ్రాత ముత్యాలకోవస్మండీ' అన్నాడు 'టైపిస్టు' గౌరీపతి. కాబోలనుకుంది. ఇవన్నీ తరవాత తరవాత మింగబొయ్యే చేదుమాత్తరకి ముందు ప్రయాసని తెలీదు అతను ఫైలు అందుకోబోయి చెయ్యే పట్టుకుని లాగాడు. ముచ్చెమటలు పట్టినై వాణీకి. 'రిజై'నిచ్చి చక్కావచ్చింది. రాధకీ అట్లాంటి ఘట్టమే ఒకటి ఎదురైతే, చెంప చెళ్లుమనిపించి, ఆ వేళనుంచి 'ఆఫీసరు' పక్కనే కుర్చీ వేసుకుంది. ఆ తరవాత ఆమెని తేరపార జూసేందుకు గుండె నిబ్బరం ఎవ్వరికీ కలగలేదు. 'ఆఫీసరు' సమేతూ తప్పనిసరిగా నిగ్రహం అలవాటు చేసుకున్నాడు.

*　　　　*　　　　*

ఎన్నడూ లేనిది ఆనాడు శీతారామయ్యని పెద్దాసుపత్రికి తీసికెళ్లింది రాధ. పరీక్షచేసి 'షుగరుం'దన్నాడు డాక్టరు. రక్తపుపోటు విస్తారంగా ఉందన్నాడు. గ్రహిణి జీర్ణించిందన్నాడు. లివరు సరిగ్గా పనిచెయ్యడం లేదన్నాడు.

'లేనిరోగమేమిటండీ?' అని అడిగాడు శీతారామయ్య. ఎగాదిగా చూశాడు డాక్టరు. ఉప్పు కారం పులుపూ పూర్తిగా మానమన్నాడు. 'మంచి నీళ్లు తాగవచ్చాండీ?' అని అడిగాడు శీతారామయ్య 'సీరియస్' గానే. మందపాటి కళ్లద్దాలలోంచి కొరకొర చూశాడు డాక్టరు. ఆసుపత్రి

మందులు పనిచెయ్యవూ అవి, కసిదీరా ఓ వందరూపాయిల ఔషధాలు కొనితెచ్చి వాడమని చాటభారతమంత 'ప్రిస్క్రిప్షన్' వ్రాసి ఇచ్చాడు. రాధ అందుకోబోతుంటే లాక్కుని జేబులో పెట్టుకున్నాడు శీతారామయ్య.

* * *

ఇంటికి వెళ్లేసరికి వాణీని చూడడానికని ఎవరో వచ్చారు. రెండో సమంధం పెళ్లికొడుకు! తను వచ్చి చూచుకోమని చెప్పనేలేదు. కాని వాళ్ల ధైర్యం! మొగ్గకపోతారా అని. కట్నం అక్కర్లేదట. పాపం అదే పోనీ లెమ్మని త్యాగం చేసేసాడు పెళ్లికొడుకు! పెళ్లిచూపులయినై. వెళ్లారు, పిల్ల నచ్చిందట. ఇంట్లో అంతా సై అంటే సై అనుకుంటున్నారు. ఇహనేముంది, పెళ్లి నిశ్చరమై పోయినట్టే. సీతారామయ్యకి లోపల దేవినట్టుగా వుంది. "వాడికి పిల్లలెంతమంది" అని రెట్టించాడు. 'ఇంటిదగ్గర పిల్లలెవరూ లేరన్నాడు వెంకటశాస్తుల్లు' అని వంటింటోనించీ అరిచింది పార్వతమ్మ. 'వెంకటశాస్తుల్లా? అట్లా చెప్పు,' అని 'ఓసి నిన్ను తగలేసిరిగదే నీ బుర్ర ఏమయిందే? వాడికిద్దరు కూతుళ్లూ, ఒక కొడుకూను. నాకు తెలుసు. కొడుక్కీ వీడికీ పడక తెగతెంపులు చేసుకున్నారు. కూతుళ్లిద్దరికీ పెళ్లిళ్లయినై. పిల్లల్ని కంటున్నారు కూడా. ఆ కొడుకు రోగం కుదర్చాలని ఈ త్రాష్టుడు రెండోపెళ్లికి తయారయ్యాడు చేసుకో అమ్మా చేసుకో మొగుడంటూ ఒకడు దొరికితే చాలు. కొన్నాళ్లు కాపరం చెయ్యా, పిల్లల్నికని వాళ్లనిపెంచి పోషించా, వాళ్లకి మళ్లీ పెళ్లిళ్లూ పెడాకులూచేసి వాళ్లచేత పిల్లల్ని కనిపించా... ఆ ముచ్చట్లన్నీ, ఒకదాని తరవాత ఒకటేమిటి ఖర్మ... అన్నీ అత్తారింటో అడుగుపెట్టగానే ఒక్కబిగిని తీరిపోత్తై, పీడాబాయిరి... నీ 'మొహమెట్లా వుందే! తెంపిపోయిసినట్టు' అని ఒక్క ఉరుమురిమాడు శీతారామయ్య. పార్వతమ్మ, ఇంతకథ వుందీ, అని కొయ్యబారిపోయింది. వాణీ ఏడుస్తూ వెనకాల గదిలోకి వెళ్లిపోయింది. ముందు గదిలోకి దూరి టేబిలు అంచుమీద తాళంవేస్తూ కూచున్నాడు శీతారామయ్య.

* * *

మిట్ట మధ్యాన్నం ఆకాశంమీద తెల్లగద్దలు చక్కర్లు కొడుతున్నాయి దీర్ఘప్లుతులలో శ్రీకృష్ణుణ్ణి పిలుస్తో. 'ఏమేవ్' ఒక్క గావుకేక పెట్టాడు శీతారామయ్య. చీరకి పట్టిన కొత్తచిరుగు కుచ్చిళ్లలో కలివెయ్యడమెట్లాగా అని తాపత్రయం పడుతో చక్కావచ్చింది పార్వతమ్మ. 'సూటుకేసు' తీసి హాల్లో దులుపుతున్నాడు శీతారామయ్య. 'ఎక్కడికీ?' అంది. 'హైదరాబాదు పోతున్నా – వాడూ డాక్టరేగా? నాకేమో వొంటో బావుల్లేదు... ఆస్పత్రి మందులేగా? వాడు మొయ్యాలిసిన బరువే ముందీ? ఏమంటావు?' ఇష్టంగా అడిగాడు. అందాకా మందుమాట ఎత్తితే టపాకాయిలా పేలిన భర్త, ఈనాడు తనకుతానే ఆ ప్రస్తావన తెచ్చేసరికి పట్టలేని ఆనందమయింది పార్వతమ్మకి. మళ్లీ గుబులు తిరుగుతుందేమో బండిటైము కావచ్చింది. పార్వతమ్మా రాధా రాణీ హడావుడిగా తిరుగుతున్నారు. వంటింట్లోకి తొంగిచూసాడు శీతారామయ్య అక్కడ కావిడిపెట్టె మీద కూచుని కిటికీలోనించీ బైటికిచూస్తూ ఏడుస్తోంది వాణీ. వెనకాలనించీ వెళ్లి భుజమ్మీద చేయివేసి 'కోపమా అమ్మా?' అని అడిగాడు. ఉలిక్కిపడి గిరుక్కున వెనక్కితిరిగి గబగబ కళ్లు తుడిచేసుకుంది వాణీ. 'నా కండవాలు సర్దవా అమ్మా?' అని వెళ్లిపోతున్నాడు శీతారామయ్య. ఆయన మాటలో కంపం

లేదు. కంఠంలో గాద్గద్యం లేదు. వెనకాలే హాలులోకి నడిచివెళ్లింది వాణీ. రాణీ పొగాకు గొట్టం తీసుకొచ్చి ఒకమూల నొక్కింది. వాణీ 'ఫ్లాస్కు' తీసుకొచ్చి ఒకవేపున కుక్కింది. ఈ గందరగోళ మంతా బెంచీమీద కూచుని నిశ్శబ్దంగా చూస్తున్నాడు శీతారామయ్య. పార్వతమ్మవచ్చి సీసాకి అడుగున మిగిలివుంటే కాస్త మందారాయిలు రుద్దింది నెత్తిన. రాధ తనూ వస్తానంది, నాన్నా ఒక్కడూ వెళ్లగలడో లేదోనని. సరే రమ్మన్నాడు, కాని మళ్లీ మార్చుకున్నాడు. 'మనిద్దరమూ కట్టగట్టుకుని దేనికి పయనం? అక్కడ కొన్నాళ్లు ఉండాలిసివస్తే తక్షణం ఉత్తరంరాస్తా వాణిని రమ్మను. లేకపోతే అమ్మని పంపు నాకు ఒత్తులెవడు ఒత్తుతాడు అక్కడ?' అన్నాడు. యాభై రూపాయిలు 'పర్సులో' పెట్టింది రాధ... 'యాభయ్యెందుకమ్మా? పర్సులో అంత డబ్బు చూస్తే తిరుగుప్రయాణానికైనా డబ్బిస్తాడా వాడు? ఆ 'ఛార్జి' వాడిమీదనే రుద్దుతా. ఎక్కడికక్కడే!' అని వారించాడు శీతారామయ్య. అట్లా కాదన్నది రాధ. వాడేమైనా అంటే పడవద్దంది. ఈ పరీక్ష చేయించుకుని ముప్పాతిక మూడుపాళ్లు మందులు రాయించుకుని వచ్చెయ్యమంది. ఆసుపత్రిలో ఉండాలిసివస్తే ఉత్తరం రాయమంది. 'ఓ ఛస్తే వాడి చేతిలో పడను' అన్నాడు శీతారామయ్య. స్టేషన్లో టిక్కట్టు కొనడమొక 'సర్కస్‌ఫీటు' అని పస్తాయిస్తున్నాడు... 'ఎందుకూ; నేను వస్తాగా' అంది వాణీ. నేనూ వస్తానని వంతుబోయింది రాణీ. 'ఇద్దరూ రండే. టిక్కట్టుకొని బండెక్కించి తిరిగి వద్దురుగాని... ఆదివారమేగా... రైళ్లు జంక్షనుగావు నిప్పుడు... అటువెళ్లే రైలెక్కేబదులు ఇటువెళ్లే రైలెక్కెయ్యగలను... నా కసలే గాభరా అంటో బట్టలు మార్చుకున్నాడు శీతారామయ్య.

వాణి రాధారాణి ఇద్దరూ వచ్చారు స్టేషనుకి. అటు వాణీ, ఇటు రాణీ చెరోవేపునా నిల్చుంటే వాళ్ల భుజాలమీద చేతులానించి 'ప్లాట్‌ఫారం' మీదికి నడిచాడు శీతారామయ్య.

రైలు వచ్చేసింది.

ఖాళీగాఉన్న ఒక పెట్టెలో కూచోబెట్టి సూట్‌కేసు పక్కనే పెట్టుకోమని, ఆ పెట్టెలోనే హైదరాబాదు వెడుతో ఎరిగినాయన ఒకాయనవుంటే... 'మా నాన్నారిని జాగర్తగా దింపండీ?' అని చెప్పింది.

టైమయింది. గంట కొట్టారు.

ఇద్దరూ గబగబా బండి దిగిపోయారు.

ఘణిల్లుమని రైలు కదిలింది.

'చప్పున వచ్చేసెయ్యి నాన్నా... వాడు ఉండమని ప్రాధేయపడితే ఉత్తరం రాయి' అని కేకేశారు.

'ప్లాట్‌ఫారం' మీద నిలబడి అట్లాగే కళ్లప్పగించి చూస్తూన్నారిద్దరూ. 'ప్లాట్‌ఫారం' దూరమవుతున్న కొద్దీ వాళ్లిద్దరూ క్రమక్రమంగా రెండపూల మొక్కలల్లే, రెండు నీడలల్లే, ఆఖరికి రెండు చుక్కలల్లే మారి, ఆకాశపుటంచుల్లో లీనమయ్యే దాకా చూస్తోనే కూచున్నాడు శీతారామయ్య.

*　　　*　　　*

ప్రొద్దున్న పదింటికి 'ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం' వచ్చింది. శీతారామయ్య రైలుకిందపడి చచ్చిపోయాడట. శవాన్ని టాక్సీమీద తీసుకొస్తున్నాడట. టెలిగ్రాం రామచంద్రమిచ్చాడు.

ఇల్లు దుఃఖ సముద్రంలో మునిగింది. పార్వతమ్మ శోషవొచ్చి పడిపోయింది. ఇరుగూ పొరుగూ మూగారు ఊరడించారు.

మధ్యాహ్నం మిడిఎండలో 'టాక్సీ'మీద శవం వచ్చింది. హైదరాబాదు స్టేషన్లో రైలు ఆగేముందు ఆదరాబాదరా దిగడంలో కాలుజారి 'ప్లాట్‌ఫారాని'కి, రైలు చక్రాలమధ్య పడ్డాడట. కాళ్లూ చేతులూ తునాతునకలయినై. నెత్తురులో తడిసి ఆనవాలేనా, దొరకని ఆ చల్లని మాంసం ముద్దలో ఎన్ని ఆశలు, ఎన్ని నిరాశలు; ఎన్ని ద్వేషాలు, ఎన్నిరోషాలు, ఎంత రక్తి, ఎంత విరక్తి, ఎంత తామసం, ఎంత కసి, మోగి మోగి మూగవోయినయ్యే ఎవరికీ కనిపించలేదు, వినిపించలేదు.

పిండప్రదానాలూ, శ్రాద్ధకర్మలూ, తెంపి పోతలూ గట్టా యధావిధిగా జరిగిపోయినై. రాధ ఉద్యోగంచేస్తూ ఏదో చక్రం తిప్పుతోందని కనిపెట్టి సెలవలైపోయినయ్యని ఆదరాబాదరా టపాకట్టేశారు సుపుత్రులిద్దరూ.

*           *           *

మర్నాడు పోస్టులో ఒక కవరు వచ్చింది. కవరు చించింది రాధారాణీ. అవి 'ఇన్‌ష్యూరెన్స్ ప్రీమియం నోటీసులు. పెద్దకళ్లు చేసుకుని పరీశీలనగా చూచింది రాధారాణీ. అమ్మా నాన్న నాలుగేసివేలకి జీవిత భీమా చేసారు ఏనాడో! ఒక్కసారీ చెప్పలేదు.

'అమ్మా, నాన్నారు... కాయితాలెక్కడపెట్టేవారే?' అని లోపలికి వెళ్లి అడిగింది రాధ. డ్రాయర్లో చూడమంది పార్వతమ్మ. 'డ్రాయరు' తెరిచింది. చుట్టలు చుట్టుకున్న నాగుపాములల్లే రెండు 'పాలసీలూ' భద్రంగా ఉన్నాయి. శీతారామయ్య 'పాలసీ' తెరిచిచూచింది. లోపలనించీ ఒక చిన్న చీటీముక్క కిందపడింది. తీసుకుని చదువుకుని చప్పున దాచేసింది రాధ.

*           *           *

పార్వతమ్మ అన్నీ వింది. 'పాలసీ అంటే ఏమిటీ?' అడిగింది. రాధారాణీ వివరంగా చెప్పింది.

*           *           *

ఆలస్యం చెయ్యకుండా డెత్‌సర్టిఫికెట్టు దాఖలుచేసి 'కార్పోరేషన్'నించీ నాలుగువేలు పట్టుకొచ్చింది.

మూడో నెల తిరక్కుండానే వాణీకి పెళ్లి ఖాయమయింది. డబ్బు శాశ్వతమా అంటారు తెలివి తక్కువగా! డబ్బంటే లక్ష్మి! విష్ణుమూర్తి భార్య!! దాన్ని నిర్లక్ష్యంచేస్తే ఆ దేవుడికే కోపం రావచ్చు!!

*           *           *

రాధ ఉద్యోగం చేస్తోంది తనకట్నపు సొమ్ము తనే సంపాదించుకొంటోంది. ఒకనాడు ఆఫీసునించీ వచ్చేసి, భోంచేసి పడుకుని, కొంచెం సేపు ఏదో పుస్తకం చదువుకుని, 'స్విచ్చి' 'ఆఫ్'చేసి, ఆవలింతలొస్తుంటే, చిటికలు వేసుకొంటూ కళ్లుమూస్కుంటే పార్వతమ్మ మంచం పట్టిమీద కూచుని కనిపించింది. ఎప్పుడొచ్చిందోయేమో. అంతరంగికంగా మాట్లాడవలసిందే మయినా వుంటే పార్వతమ్మ ధోరణి అది!

'అయితే రాధీ... నాన్నగారు వెళ్లిపోయారు కదా... ఏదో మహారాజు! చచ్చిపోతూ కూడా ఒక పిల్ల దాని కన్నెచెర విడిపించి మరీ తనదారి తను చూచుకున్నారు... ఎవరికేనా అదే దారి అనుకో... ఏదో ముందూ వెనకా అంతే... ఉట్టిగట్టుకుని కలకాలం ఊగులాడతామా?'

'ఏమిటమ్మా ఈ ధోరణి?' అని విసుక్కుంది రాధ.

అది కాదమ్మా... మరి... ఆ కాయితం, మనిషి హరీ అంటేనేగాని మారదాయేం?' చట్టున ఆగింది. రాధమెదలకుండా ఊరుకుంది.

"అయితే మరి... నాన్న కాయితానికి నాలుగు వేలొచ్చినయికదా, నా కాయితానికీ నాలుగు వేలొస్తయ్యన్నమాటే కదా? వస్తే మరి నీ..."

మాట మధ్యలో తుంచేసి చప్పున ఆమె నోరు మూసింది రాధ.